# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 4-1-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 126 | పేజీలు:4 | వెల: రూ.1/-


## ఆదాయ పన్నుల చెల్లింపులు గడువును పొడిగించిన ఐటీ శాఖ

న్యూఢిల్లీ, జనవరి 3:ఆదాయ పన్నుల చెల్లింపులు చేయడానికి 2021, డిసెంబర్ 31 అర్ధరాత్రి 12 గంటలతో గడువు ముగిసింది. చాలామంది కోరుకున్నట్లుగా ఐటీ రిటర్న్స్ గడువును పొడిగించలేదు. పైగా పొడిగింపు ఉద్దేశమే లేదంటూ చివరిరోజు స్వయంగా ప్రభుత్వమే ప్రకటన చేసింది. కానీ, రిటర్న్ దాఖలుచేసినా.. ఈ–వెరిఫై పూర్తి కానివాళ్ల కోసం గుడ్ న్యూస్ చెప్పింది. ఐటీ రిటర్న్ వెరిఫై ప్రాసెస్ పూర్తి కానివాళ్ల కోసం ఊరట ఇచ్చింది ఆదాయ శాఖ. ఆన్‌లైన్‌లో ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన టైంలో చాలామందికి కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన తర్వాత రిటర్న్ వెరిఫై చేయాల్సి ఉంటుంది. వెరిఫై చేయటం అంటే.. పాన్‌తో ఆధార్ అనుసంధానమై, సంతకం అవసరం లేకుండా ఓటీపీ ద్వారా పంపటం. అయితే, ఓటీపీ వచ్చిన తర్వాత, పోర్టల్‌లో వేసినా 'లోడింగ్' కాకపోవడం వల్ల సబ్మిట్ అవ్వడం లేదు. దీనర్థం రిటర్న్‌ను దాఖలు చేసినప్పటికీ ఈ?వెరిఫై పూర్తి కాలేదని. ఇలా ఎంతో మంది .. గంటల తరబడి ప్రయత్నించినా వెరిఫై కాలేదు. ఈ కష్టాలను దృష్టిలో పెట్టుకుని గడువును 2022 ఫిబ్రవరి 28 వరకూ డిపార్ట్‌మెంటు పెంచింది. ఇది కేవలం వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉన్న వారికి మాత్రమే. రిటర్న్‌లు వేయడానికి పొడిగించినట్లు కాదు. వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉంటే వారు వెంటనే వెరిఫై చేసుకోండి.

# శివపార్వతి థియేటర్‌లో భారీ అగ్నిప్రమాదం




హైదరాబాద్, జనవరి 3:హైదరాబాద్ కూకట్‌పల్లిలోని కేపీహెచ్‌బీ కాలనీలో ఉన్న శివపార్వతి థియేటర్‌లో గత అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా చెలరేగిన మంటలు థియేటర్ మొత్తాన్ని చుట్టుముట్టాయి. హాలులోని స్క్రీన్, కుర్చీలు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడడంతో పైకప్పు కూలిపోయింది.

అయితే, ఆ సమయంలో థియేటర్‌లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న వెంటనే థియేటర్ వద్దకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు.

ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శివపార్వతి థియేటర్‌లో ప్రస్తుతం శ్యామ్ సింగరాయ్ సినిమా నడుస్తోంది. ప్రమాదంలో దాదాపు రూ. 2 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

## బండి సంజయ్ కి 14 రోజుల రిమాండ్

హైదరాబాద్, జనవరి 3: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కి కరీంనగర్ కోర్టులో చుక్కెదురైంది. బండికి బెయిల్ ఇచ్చేందుకు న్యాయమూర్తి నిరాకరించడంతో పాటు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బండి సంజయ్ ను కరీంనగర్ జైలుకు పోలీసులు తరలిస్తున్నారు.

నిన్న(జనవరి 2) రాత్రి కోవిడ్ ఆంక్షలకు విరుద్ధంగా జాగరణ దీక్ష చేపట్టడంతో పాటు పోలీస్ విధులను అడ్డుకోవడంతో బండి సంజయ్ పై పోలీసులు కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ కు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు.

# కాలేజీలో ర్యాగింగ్.. కఠిన చర్యలు తీసుకుంటాం: హరీశ్

హైదరాబాద్, జనవరి 3: సూర్యాపేట మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. ఓ జూనియర్ విద్యార్థి దుస్తులు విప్పించి ఫొటోలు తీశారు సీనియర్ విద్యార్థులు. దీంతో తల్లిదండ్రులకు బాధిత విద్యార్థి సమాచారం ఇచ్చాడు ఆ విద్యార్థి. వారు 100కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో సీనియర్ల నుంచి పోలీసులు ఆ విద్యార్థిని కాపాడారు. ఈ ఘటనలో 25 మందిపై కేసు నమోదు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మెడికల్ కాలేజీలో జరిగిన ఈ ర్యాగింగ్ ఘటన తెలంగాణ వ్యాప్తంగా అలజడి రేపుతోంది. బాధిత విద్యార్థి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు తెలిసింది. బాధిత విద్యార్థిపై బలవంతంగా దుస్తులు తొలగించిన సీనియర్లు అక్కడితో వదిలేయకుండా ట్రిమ్మర్ తో జుట్టు తొలగించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. సీనియర్ల నుంచి తప్పించుకుని అతడు తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. ఈ ర్యాగింగ్ అంశం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ర్యాగింగ్ ఘటనపై వైద్య శాఖ మంత్రి హరీశ్ రావు కూడా స్పందించారు. ర్యాగింగ్ వంటి ఘటనలను రాష్ట్ర సర్కారు తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఘటనపై విచారణకు ఆదేశించామని తెలిపారు. డీఎంఈ రమేశ్ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ వేశామని, కమిటీ నుంచి రిపోర్ట్ రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ర్యాగింగ్ జరిగిందో లేదో తెలుసుకునేందుకే ఈ కమిటీ వేశామని ఆయన చెప్పడం గమనార్హం. నివేదిక ఈ రోజే వస్తుందని ఆయన చెప్పారు.

## హైదరాబాద్ లో వ్యాక్సిన్ టెస్టింగ్ ల్యాబ్.. త్వరలోనే ప్రారంభం..

హైదరాబాద్, జనవరి 3:2022 కొత్త సంవత్సరం తెలంగాణకు సరికొత్త ఉత్తేజాన్ని తేనుంది. ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ డెవలప్ అవుతోంది. ఈ క్రమంలో గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ)లో కొత్త వ్యాక్సిన్ టెస్టింగ్ లాబొరేటరీ (వీటీఎల్) ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దాదాపు రెండు నెలల్లో ఇది కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలి తర్వాత పూణేలో ల్యాబ్ ఉంది.. కాగా దేశంలోనే ఇది రెండో ఎఐ, మూడో ల్యాబొరేటరీ కానుంది.

పీఎం కేర్స్ ఫండ్ కింద సుమారు రూ.10 కోట్లతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఔఎంఃలోని ఎఐ ఇప్పటికే అనేక టీకా బ్యాచ్‌లను పరీక్షించడం ప్రారంభించింది. కొన్ని స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ూూఖ) ఉన్నాయి. వివిధ కంపెనీలు వివిధ రకాల వ్యాక్సిన్‌లను తయారు చేస్తున్నందున వ్యాక్సిన్‌లను వేర్వేరు ప్రోటోకాల్‌ల కోసం పరీక్షించడం జరుగుతుందని ఔఎంః అధికారి ఒకరు చెప్పారు.

అనుభవజ్ఞులైన సిబ్బంది ఎఐలో పనిచేస్తున్నారని, వివిధ పరీక్షా పారామీటర్లలో టీకా బ్యాచ్‌ల పనితీరును నిర్ధారిస్తున్నారని.. వాటి రిజల్ట్, గైడ్ లైన్స్ తో కంపేర్ చేస్తున్నారని చెప్పారు. కొన్ని సందర్భాల్లో తయారీదారులు అదనపు వివరాలు, ప్రోటోకాల్స్ డిటేయిల్స్ అడుతున్నారన్నారు.. "ఈ ల్యాబ్‌లో నెలకు 60 నుండి 70 బ్యాచ్‌లను పరీక్షించడానికి ఎక్విప్ మెంట్ ఉంది" అని చెప్పారు.

కాగా, ల్యాబ్ కోసం తెలంగాణ ప్రభుత్వం చేసిన అనేక విజ్ఞప్తుల మేరకు గత సంవత్సరం కేంద్రం హైదరాబాద్, పూణేలకు ఎఐలను ప్రకటించింది. హైదరాబాద్‌లో ఎఐ ఆవశ్యకతను నొక్కి చెబుతూ పరిశ్రమల శాఖ మంత్రి ఐ ం రామారావు జూన్ 2021లో అప్పటి కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్దన్‌కు, కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. ఆయన కృషితో ఇప్పుడు ల్యాబ్ అందుబాటులోకి రానుంది.

# తల్లిదండ్రులంతా విధిగా తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలి : హరీశ్ రావు




హైదరాబాద్, జనవరి 3:ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు హైదరాబాద్ బంజారాహిల్స్‌లో వ్యాక్సినేషన్ 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు కలిగిన పిల్లలకు కరోనా వ్యాక్సిన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ? రాష్ట్ర వ్యాప్తంగా 1,014 కేంద్రాల్లో పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన పిల్లలందరికీ కొవాగ్జిన్ వ్యాక్సిన్లు ఇస్తామని తెలిపారు. వ్యాక్సినేషన్ కార్యక్రమంలో తెలంగాణ ముందంజలో ఉందని హరీశ్ రావు చెప్పారు. అర్హులైన పిల్లలు అందరూ వ్యాక్సిన్లు తీసుకునేలా ప్రోత్సహించాలని పాఠశాలలు, కళాశాలలకు కూడా సూచనలు చేశామని చెప్పారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ పిల్లలకు టీకాలు ఇచ్చేందుకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. తల్లిదండ్రులంతా విధిగా తమ పిల్లలను వ్యాక్సిన్ కేంద్రాలకు తీసుకొచ్చి టీకాలు వేయించాలని ఆయన కోరారు.

పిల్లలకు వ్యాక్సిన్ వేయించే బాధ్యత తల్లిదండ్రులదేనని హరీశ్ రావు చెప్పారు. వ్యాక్సిన్లు వేయించుకోని విద్యార్థులు అనేవారే లేకుండా అర్హులైన పిల్లలందరికీ వ్యాక్సిన్లు అందేలా టీచర్లు, లెక్చరర్లు ప్రోత్సహించాలని చెప్పారు. పిల్లలకు వారి తల్లిదండ్రులు లేదా టీచర్ల సమక్షంలో వ్యాక్సిన్లు వేస్తున్నట్లు చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారు సెకండ్ డోసు వ్యాక్సిన్ కూడా తప్పకుండా తీసుకోవాలని ఆయన సూచించారు. 60 ఏళ్లు పైబడి అనారోగ్యంతో బాధపడుతోన్న వారు, ఫ్రంట్ లైన్ వర్కర్లు అందరికీ బూస్టర్ డోసు కూడా ఇవ్వనున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 10 నుంచి బూస్టర్ డోసు ఇస్తామని ఆయన చెప్పారు.

వ్యాక్సిన్లు వేసుకుంటేనే రోగ నిరోధక శక్తి పెరిగి, వ్యాధిని నిరోధించడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. 100 శాతం మొదటి డోసు వ్యాక్సిన్లు వేసిన రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వ ప్రశంసలను తెలంగాణ అందుకుందని ఆయన చెప్పారు. థర్డ్ వేవ్ వస్తే కరోనా నుంచి వ్యాక్సిన్లు రక్షిస్తాయని హరీశ్ రావు చెప్పారు. థర్డ్ వేవ్ ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. వైద్య పరికరాలు, అన్ని సదుపాయాలను సిద్ధం చేసిందని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని చెకోరారు.

# మంత్రి తలసాని ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



హైదరాబాద్, జనవరి 3:ఆదర్శనగర్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఆదివారం రాత్రి పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తి శ్రద్ధలతో ఎంతో ఘనంగా నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే వరకు నిర్వహించిన ఈ పూజల్లో పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ తదితరులు పాల్గొని అయ్యప్పస్వామికి నిర్వహించిన అభిషేకాన్ని తిలకించారు. ఈ సందర్భంగా వారిని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ శాలువాతో సత్కరించి, స్వామి ప్రసాదాలు అందజేశారు.

# వ్యవసాయ రంగానికి ఏడాదికి రూ.60 వేల కోట్లు ఖర్చు చేస్తున్నం



హైదరాబాద్, జనవరి 3: తెలంగాణలో వ్యవసాయ రంగానికి దేశంలో ఏరాష్ట్రం ఖర్చు చేయని విధంగా 60వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం అన్ని జిల్లాల డీఏఓలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రైతుబంధుకు కేసీఆర్ ప్రత్యేక ముద్ర వేశారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ విజయకిరీటంలో వ్యవసాయ శాఖ పాత్ర వజ్రం లాంటిది. కరోనా కష్టకాలంలోనూ వ్యవసాయ ఉత్పత్తులలో తెలంగాణ అగ్రస్థానం నిలిచిందన్నారు.వరి ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్ ను తెలంగాణ మించడం అసాధారణ విజయమని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గనిర్దేశనంలో వ్యవసాయ శాఖ ఉద్యోగులు ఎంతో బాగా పనిచేశారని, కరోనా విపత్తులో ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ సేవలు అనిర్వచనీయమని చెప్పారు. ఈ 8వ విడతతో కలిపి ఒక్క రైతుబంధు పథకం కిందనే రైతులకు ఇచ్చిన డబ్బులు రూ.50 వేల కోట్లకు చేరుతున్నదని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కూడా రైతాంగానికి ఇన్నినిధులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.వ్యవసాయ రంగానికి ఏటా రూ.60 వేల కోట్లు ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి స్పష్టం చేశారు. రైతుబంధు పథకం ఈ మైలురాయిని అందుకోవడం చారిత్రకమని అన్నారు. రైతుబంధు వారోత్సవాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతుబంధు సంబరాల కరపత్రాన్ని మంత్రి విడుదల చేశారు.

# పెరుగుతున్న ఒమిక్రాన్ కేసులు.. వ్యర్థాలపై తస్మాత్ జాగ్రత్త..

హైదరాబాద్, జనవరి 3:నగరంలో ఒమిక్రాన్ కేసులు పెరుగుతుండడం.. వైరస్ బారిన పడి పొరుగు రాష్ట్రాలకు చెందిన రోగులు సిటీకి వచ్చి ఇక్కడి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండడంతో రోగులు వాడిపడేసిన వ్యర్థాలపై సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. వీటి సేకరణ శాస్త్రీయంగా జరగని పక్షంలో ముప్పు తప్పదని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిత్యం సుమారు 23 వేల కిలోల జీవ వ్యర్థాలు ఉత్పన్నమౌతున్నాయి. ఇందులో సింహభాగం గ్రేటర్ హైదరాబాద్, పరిసర ప్రాంతాలనుంచే కావడం గమనార్హం.

ఈ వ్యర్థాల్లోనే కోవిడ్ వ్యర్థాలు కూడా ఉంటున్నాయి. సాధారణ చెత్తతో పాటు.. రోగులు వాడి పడేసిన మాస్కులు, గ్లౌజులు, సిరంజిలు, ఇతర వ్యర్థాలను తరలిస్తే పారిశుద్ధ్య సిబ్బంది, స్థానికులు కూడా కోవిడ్ బారిన పడే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పరిస్థితి విషమించకముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు స్పష్టంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటు పీసీబీ.. అటు ఆస్పత్రులు.. సిటీజన్లు వ్యర్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## చరిత్రలో నేటినిజం




# ఆయుష్ మంత్రిత్వ శాఖ క్యాంటీన్‌లో అందుబాటులో 'ఆయుష్ ఆహార్'

న్యూఢిల్లీ, జనవరి 3:ఆయుష్ మంత్రిత్వ శాఖ తన క్యాంటీన్‌లో 'ఆయుష్ ఆహార్'ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. పౌష్టికాహారం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తున్న ఆయుష్ మంత్రిత్వ శాఖ కాంటీన్ లో ఆయుష్ ఆహారాన్ని సోమవారం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి తన లక్ష్య సాధనలో మరో అడుగు ముందుకు వేసింది.

పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన 'ఆయుష్ ఆహార్'లో వెజిటబుల్ పోహా, జావ పిండితో చేసిన వడ, క్యారెట్ హల్వా మరియు కోకుం డ్రింక్ ఉన్నాయి. అన్ని వంటకాలు ప్రజలకు నచ్చుతాయని వీటిలో పోషక విలువలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయుష్ సెక్రటరీ వైద్య రాజేష్ కోటేచా మాట్లాడుతూ క్యాంటీన్‌లో అందుబాటులో ఉంచిన ఆయుష్ ఆహార్ పదార్థాలు సులభంగా జీర్ణం అవుతాయని ఆరోగ్యానికి మంచివని అన్నారు. 2021లో మంత్రిత్వ శాఖ వివిధ రాష్ట్రాలతో కలిసి పని చేస్తున్నదని తెలిపారు. జాతీయ ఆయుష్ మిషన్ కింద మంత్రిత్వ శాఖ అనేక కార్యక్రమాలను అమలు చేసిందని శ్రీ కోటేచా అన్నారు. "ఈ సంవత్సరం విద్య, పరిశోధన, తయారీ, ప్రజారోగ్యం, పరిపాలన అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తాం. సింగిల్ విండో వ్యవస్థ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం." అని చెప్పారు.

2022లో ఆయుష్ జీవనశైలిని ప్రోత్సహించేందుకు అమలు చేయాల్సిన కార్యాచరణ కారక్రమాన్ని అధికారులు సమావేశంలో చర్చించారు. ఆయుష్ ఆహార్ కొనుగోలు చేస్తున్న వారి నుంచి సూచనలు తీసుకుని అమలు చేస్తామని ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ ప్రమోద్ కుమార్ పాథక్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన స్పందన మేరకు మరికొన్ని ఆహార పదార్థాలను అందుబాటులోకి తెస్తామని ఆయన అన్నారు.

కార్యక్రమంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శులు కవిత గార్గ్, డి. సెంథిల్ పాండియన్ కూడా పాల్గొన్నారు.

# చెర్ల ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు కీలక తీర్పు

హైదరాబాద్: చెర్లలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు కీలక తీర్పు వెలువరిచింది. 2018లో తెలంగాణ, ఒడిషా సరిహద్దులోని చెర్ల ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్.. బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ ప్రజా హక్కుల సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. మృతదేహాలకు రీపోస్టుమార్టం, పోలీసులపై హత్యా నేరం కేసు పెట్టాలన్న పిటిషనర్లు కోరారు. రీపోస్టుమార్టం, హత్యానేరం కేసు నమోదు చేశామని కోర్టుకు జీపీ తెలిపారు. కేసు నమోదైన కారణంగా తదుపరి విచారణ అవసరం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. 3 నెలల్లోగా ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తు పూర్తి చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది.




# అంధుల పాలిట జ్ఞాన దీపం లూయిస్ బ్రెయిలీ

**(04 జనవరి 'ప్రపంచ బ్రెయిలీ దినం' సందర్భంగా)**

ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఒక బిలియన్ అంగవైకల్య జనులు ఆరోగ్య, విద్య, విధి నిర్వహణల్లో అసమానతలను ఎదుర్కొంటూనే, కడు పేదరికం, అనాదరణ, నిర్లక్ష్యం, వేదింపులు, మానవ హక్కుల ఉల్లంఘనలు, అసమానతలు, కృరత్వాలకు గురి అవుతున్నారు. అంగవైకల్య వర్గంలో అంధత్వం అత్యంత ప్రమాదకరమైనదిగా గుర్తించబడింది. కంటి చూపు లోపించిన అభాగ్యులకు 'బ్రెయిల లిపి' వరంగా మారడం చూస్తున్నాం. బ్రెయిలీ లిపి రూపశిల్పి లూయిస్ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా ప్రతి ఏట 04 జనవరిన 'ప్రపంచ బ్రెయిలీ దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. 04 జనవరిన ఐక్యరాజ్య సమితి తీర్మానంతో 2019 నుంచి ప్రపంచ బ్రెయిలీ దినం పాటిస్తున్నాం.

**లూయిస్ బ్రెయిలీ జీవితం?:**

04 జనవరి 1809న ఫ్రాన్స్‌లో గుర్రుపై స్వారీకి సంబందించిన లెదర్ వ్యాపారి (హార్నెస్ షాప్) కుటుంబంలో జన్మించిన లూయిస్ బ్రెయిలీ 3-ఏళ్ల బాల్యంలో జరిగిన ప్రమాద కారణంగా చూపును కోల్పోవడం దురదృష్టకరం. కంటి చూపు కోల్పోవడంతో కారు చీకట్లు కమ్మిన కారణంగా నిరాశకు గురి కాకుండా తన గ్రామ పాఠశాలలో వినికిడి జ్ఞానంతో చదువుతూ చురుకైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు. తన ప్రతిభను గుర్తించి 10 ఏటనే స్కాలర్‌షిప్ పొంది, పారిస్‌లోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ బ్లైండ్ యూత్'లో చదవడం ప్రారంభించారు. 'చార్లెస్ బార్బియర్' సహకారంతో తన 15వ ఏటనే బ్రెయిలీ లిపిని ప్రవేశ పెట్టి ప్రపంచ అంధుల పాలిట జ్ఞాన దీపం వెలిగించారు. 1829లో లూయిస్ బ్రెయిలీ రచించిన 'మెథడ్ ఆఫ్ రైటింగ్ వర్డ్స్' పుస్తకం ప్రచురితం అయ్యింది. లూయిస్ బ్రెయిలీ 19వ ఏటనే ఉపాధ్యాయుడిగా నియమించబడ్డారు. కాలక్రమంలో బ్రెయిలీ లిపిని మరింత సరళంగా మార్పు చేస్తూ 1837లో తొలి బ్రెయిలీ లిపి పుస్తకం విడుదల చేశారు. నేడు ప్రపంచ అంధుల లిఖిత బ్రెయిలీ భాషగా లూయిస్ బ్రెయిలీ బహుళ ప్రచారం, ఆచరణ పొందడం ప్రారంభమైంది. కంటి చూపు మందగించిన లేదా అంధ వ్యక్తుల జ్ఞాన సమపార్జనకు దోహదపడుతున్న బ్రెయిలీ లిపి ద్వారా జ్ఞాన వెలుగులు నింపడం జరుగుతున్నది. బ్యాంకులు, కార్యాలయాలు, హోటళ్లు, ఆసుపత్రులు లాంటి రంగాల్లో బ్రెయిలీ లిపి సౌకర్యం నేటికీ అమలు కాక పోవడంతో అంధులకు ఎంపికలో స్వేచ్ఛ, ప్రాధాన్యత, సమానత్వం లభించడం లేదు.

06 జనవరి 1852న లూయిస్ బ్రెయిలీ క్షయవ్యాధితో 43వ ఏట అమరుడయ్యాడు. బ్రెయిలీ మరణించిన 2 ఏండ్ల అనంతరం మాత్రమే ఫ్రాన్స్‌లోని 'రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్లైండ్ యూత్' విద్యార్థులకు బ్రెయిలీ లిపిలో బోధనలు ప్రారంభించారు.

1916 తరువాత అమెరికాలో కూడా అంధుల పాఠశాలల్లో బ్రెయిలీ భాషతో బోధనలు ప్రారంభమైనాయి. నేడు బ్రెయిలీ లిపి అత్యంత ప్రచారంలోకి రావడంతో ఏటియం, ఎలివేటర్స్, కాలిక్యులేటర్స్, రూబిక్స్ క్యూబ్, వాచెస్ లాంటి పలు రంగాల్లో బ్రెయిల లిపి వాడబడుతున్నది. బ్రెయిలీ లిపిలో కాగితపు గ్రిడ్లపై ఆరు డాట్స్‌ను 64 రకాల సంయోగాలతో వ్రాయడం జరుగుతుంది. దీని ద్వారా అంధులు స్పర్శ జ్ఞానంతో చదవడం, రాయడం వీలు కలిగింది. అంధులకు బ్రెయిలీ లిపిని అందుబాటులోకి తేవడం, సకల సౌకర్యాలు కలిగిన అంధుల పాఠశాలలు నెలకొల్పడం, బ్రెయిలీ లిపిలో పుస్తకాలు ముద్రించడం, అంధులకు టేప్ రికార్డ్లు, ఆడియో పాఠాలు అందించడం జరుగుతున్నాయి. వివేకానందుడు, శ్రీనివాస రామానుజన్ లాంటి తక్కువ జీవితకాలం జీవించిన మహానుభావుల వలె లూయిస్ బ్రెయిలీ కూడా ప్రపంచ అంధ మానవాళికి అక్షర చూపును అందించి 43 ఏండ్లకే అమరుడై, నిత్య ప్రేరకుడై, మన గుండెల్లో పదిలంగా జీవించే ఉన్నారు. ప్రపంచ అంధులలో జ్ఞానకాంతులు నింపిన లూయిస్ బ్రెయిలీ జీవితం మనందరికీ మార్గదర్శనం చేయాలి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# విజయసాయికి సోము వీర్రాజు కౌంటర్

అమరావతి, జనవరి 3:గుంటూరు జిన్నా టవర్, విశాఖ కేజీహెచ్ పేర్లు మార్చాలంటున్న ఏపీ బీజేపీ నేతలవి మరుగుజ్జు ఆలోచనలు అంటూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఘాటుగా స్పందించారు. రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలా అని గోతికాడ నక్కల్లా కాచుకుని ఉండే మీవంటి వారితో నీతులు చెప్పించుకునే పరిస్థితిలో ఏపీ బీజేపీ లేదని ఆయన అన్నారు. నిత్యం ల్యాండ్, శాండ్, వైన్ ద్వారా పేద ప్రజల కష్టాన్ని పీక్కుతినే రాబందుల వంటి మీరా మాకు హితబోధ చేసేది? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాఖ భూములపై కన్నేసి మూడు రాజధానులంటూ కుట్రలకు తెరదీసిన మీ నీతులు మాకు అవసరంలేదన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేదీ, అమరావతిని నిర్మించేదీ, విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేదీ, ప్రత్యేక ప్యాకేజీ నిధులు ఇచ్చేదీ, రాష్ట్రంలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించి ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి చేస్తున్నదీ నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని సోము వీర్రాజు స్పష్టం చేశారు. దేశ ద్రోహుల పేర్లు మీరు మార్చకపోతే, ఏపీలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పకుండా వాటి పేర్లు మార్చుతుందని సోము వీర్రాజు తేల్చి చెప్పారు.

# తెలంగాణలో లాక్ డౌన్‌పై క్లారిటీ ఇచ్చిన డీహెచ్

హైదరాబాద్, జనవరి 3:తెలంగాణలో కరోనా కేసులు, ఒమిక్రాన్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో ప్రజల్లో ఆందోళన కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో లాక్ డౌన్ పెట్టబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

తెలంగాణలో లాక్ డౌన్ విషయంపై హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రంలో కేసుల తీవ్రత పెరిగితే లాక్ డౌన్, కర్ఫ్యూ గురించి ఆలోచిస్తామన్నారు. జనవరి చివరి వారంలో లాక్ డౌన్ ఉండే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని, శానిటైజర్ వాడాలని సూచించారు. కరోనా మూడో దశ ప్రమాదం కాకపోయినా.. ప్రజలు అప్రమత్తంగా వుండాలన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 15 నుంచి 18 ఏళ్ల వయస్సు వారికి టీకాలు అందించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశామని శ్రీనివాసరావు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 18 లక్షల మంది అర్హులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించేందుకు ముందుకు రావాలని డీహెచ్ శ్రీనివాస రావు పిలుపునిచ్చారు.

# శ్రీకాకుళంలో పిల్లలకు వ్యాక్సిన్



శ్రీకాకుళం, జనవరి 3: శ్రీకాకుళం జిల్లాలో 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు వాక్సినేషన్ కార్యక్రమం సోమవారం ప్రారంభం అయింది. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పలు కేంద్రాలు, పాఠశాలల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 1.34 లక్షలు ఉన్నారన్నారు. వీరందరికీ వాక్సినేషన్ పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 929 గ్రామ, వార్డు సచివాలయాలలో వాక్సినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వాక్సినేషన్ వేసుకోవాలని తద్వారా కరోనా నుండి రక్షణ లభిస్తుందన్నారు. జిల్లాలో మొదటి డోసు వాక్సినేషన్ ఇప్పటికే శత శాతం పూర్తి చేశామన్నారు.

రెండవ డోసు 70 శాతం పూర్తి అయ్యిందని, అందరూ రెండవ డోసు వేసుకొని కరోనా నుండి సురక్షితంగా ఉండాలని ఆయన సూచించారు. 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలు అందరూ వాక్సినేషన్ వేసుకోవాలన్నారు. పిల్లలకు కోవాక్సిన్ టీకా ఇస్తున్నమన్న కలెక్టర్.. వాక్సిన్ సురక్షితమైనదని చెప్పారు. విద్యార్థులతో వాక్సినేషన్ పై ముఖాముఖి మాట్లాడారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వాక్సినేషన్ పొందాలని సూచించారు. చుట్టు ప్రక్కల ఉన్నవారికి తెలియజేయాలని కలెక్టర్ కోరారు.

# సూర్యాపేట ర్యాగింగ్ కేసులో ఆరుగురిపై కేసు నమోదు

హైదరాబాద్, జనవరి 3:తెలంగాణలో సంచలనం రేపిన సూర్యాపేట వైద్యకళాశాలలో ర్యాగింగ్ ఘటనలో ఆరుగురు విద్యార్థులపై కేసు నమోదైంది. మంత్రి హరీశ్‌రావు ఆదేశాలతో ఉన్నతాధికారులు.. పోలీసులు విచారణ చేపట్టారు. వసతి గృహంలో విచారణ చేపట్టిన డీఎస్పీ మోహన్ కుమార్ ఆరోపణలు ఎదుర్కొంటున్న 30 మంది విద్యార్థులను ప్రశ్నిస్తున్నారు. ఘటనకు సంబంధించి ఆరుగురిపై కేసు నమోదు చేశామని డీఎస్పీ వెల్లడిచారు. మొత్తం 6 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.మరోవైపు సూర్యాపేట వైద్య కళాశాలలో జూనియర్? విద్యార్థిపై ర్యాగింగ్ ఘటనకు సంబంధించి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు స్పందించారు. ర్యాగింగ్ విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించేందుకు ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కమిటీ నివేదిక అందిన తర్వాత ర్యాగింగ్ జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో మేజర్ ధ్యాన్ చంద్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి శంకు స్థాపన చేసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జనవరి 3:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ లోని మీరట్‌లో మేజర్‌ధ్యాన్ చంద్ క్రీడా విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేశారు. 700 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ యూనివర్సిటీని నెలకొల్పుతారు. సింథటిక్ హాకీ గ్రౌండ్, ఫుట్‌బాల్ గ్రౌండ్, బాస్కెట్ బాల్ , వాలీబాల్ , హ్యాండ్ బాల్, కబడ్డీ గ్రౌండ్, లాన్ టెన్నిస్ కోర్టు, జిమ్నాజియం హాల్ , సింథటిక్ రన్నింగ్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, బహుళ ఉపయోగ మందిరం, సైక్లింగ్ వెలోడ్రోమ్ వంటి అధునాతన క్రీడా సదుపాయాలు, పరికరాలతో దీనిని ఏర్పాటు చేస్తారు.

ఈ యూనివర్సిటీలో షూటింగ్, స్క్వాష్, జిమ్నాస్టిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్చరీ, కనోయింగ్, కాయకింగ్ తదితర సదుపాయాలు ఉంటాయి. ఈ విశ్వవిద్యాలయం 540 మంది మహిళా క్రీడాకారిణులు, 540 మంది పురుష క్రీడాకారులు కలిపి మొత్తం 1080 మంది కి శిక్షణ ఇచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

ఈ సందర్భంగా హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రధానమంత్రి, స్వతంత్ర భారతావనికి కొత్త దిశా నిర్దేశం చేయడంలో మీరట్ దాని పరిసర ప్రాంతాలకు చెప్పుకోదగిన పాత్ర ఉందని ప్రధానమంత్రి అన్నారు.

సరిహద్దులలో దేశ రక్షణకు ఈప్రాంత ప్రజలు తమ ప్రాణాలను త్యాగం చేశారని, క్రీడా ప్రాంగణంలో భారత ప్రతిష్ఠను ఉన్నతస్థాయికి తీసుకువెళ్లారన ఆయన అన్నారు.

ఈ ప్రాంతం దేశభక్తి జ్వాలలను సజీవంగా ఉంచిందని ప్రధాని ఉద్ఘాటించారు. భారతదేశ చరిత్రలో, మీరట్ ఒక నగరం మాత్రమే కాదు, ఇది సంస్కృతి కి, శక్తికి ఒక ముఖ్యమైన కేంద్రంగా ఉంది", అని ప్రధాన మంత్రి అన్నారు. మ్యూజియం ఆఫ్ ఫ్రీడమ్, అమర్ జవాన్ జ్యోతి , బాబా ఔఘర్ నాథ్ జీ దేవాలయం అందిస్తున్న స్ఫూర్తి పై ప్రధాన మంత్రి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మేజర్ ధ్యాన్ చంద్ మీరట్ లోక్రియాశీలంగా ఉండే వారని ప్రధానమంత్రి గుర్తు చేశారు. కొన్ని నెలల క్రితం, కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత క్రీడా పురస్కారానికి మేజర్ ధ్యాన్ చంద్ పేరు పెట్టిన విషయాన్ని ప్రధానమంత్రి గుర్తు చేశారు. మీరట్ క్రీడా విశ్వవిద్యాలయాన్ని మేజర్ ధ్యాన్ చంద్ కు ఈరోజు అంకితం చేస్తున్నట్టు ప్రధానమంత్రి ప్రకటించారు.

ఉత్తరప్రదేశ్ లో మారిన విలువల గురించి ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. గతంలో నేరస్థులు, మాఫియాలు ఇక్కడ తమ ఆటలు సాగించేవి. అక్రమ ఆక్రమణలు, ఆడపడచులకు వేధింపులు యధేచ్ఛగా సాగేవని అన్నారు. గతంలో అభద్రత, చట్టరాహిత్య పరిస్థితులు నెలకొని ఉండడాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఇలాంటి నేరస్థులలో చట్టం గురించిన భయాన్ని కలిగిస్తున్నదని ఆయన అన్నారు. ఈ మార్పు ఆడపడుచులలో ఆత్మవిశ్వాసాన్ని తీసుకువచ్చిందని, ఇది దేశం మొత్తానికి ఆనందం కలిగిస్తున్నదని ఆయన అన్నారు.నవభారతావనికి యువత ఎంతో కీలకమని ప్రధానమంత్రి అన్నారు. నవ భారతావనిని తీర్చి దిద్దేది, దానికి నాయకత్వం వహించేది యువతే అన్నారు. మన యువత మన ప్రాచీన వారసత్వాన్ని, ఆధునికతను కలిగి ఉందని ఆయన అన్నారు. యువత ఎక్కడికి వెళితే ఇండియా కూడా ముందుకు సాగుతుందని అన్నారు. అలాగే ఇండియా వెళుతున్న మార్గంలో ప్రపంచం వెళుతున్నదని ఆయన అన్నారు.

గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం నాలుగు అంశాలలో భారత క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్టు ప్రధానమంత్రి తెలిపారు. అవి వనరులు, శిక్షణకు ఆధునిక సదుపాయాలు, అంతర్జాతీయంగా వారి ప్రతిభ వ్యక్తం అయ్యేలా చేయడం, క్రీడాకారుల ఎంపికలో పారదర్శకత అని అన్నారు.

దేశంలో క్రీడలు అభివృద్ధి చెందాలంటే యువతకుక్రీడలపై విశ్వాసం ఉండాలని, వారిని క్రీడలను ఒక ప్రొఫెషన్ గా తీసుకునేందుకు ప్రోత్సహించాలని అన్నారు. ఇది నా సంకల్పం, నా కల కూడా. ఇతర ప్రొఫెషన్ల మాదిరే క్రీడలనూ ఒక ప్రొఫెషన్‌గా మన యువత చూడాలి అని ప్రధానమంత్రి అన్నారు. ప్రభుత్వం క్రీడలను ఉపాధితో ముడిపెట్టినట్టు ఆయన చెప్పారు. టార్గెట్ ఒలింపిక్స్ పోడియం (టిఒపిఎస్) వంటి పథకాలు ఉన్నత స్థాయి క్రీడాకారులు అత్యున్నత స్థాయిలో పోటీపడేందుకు వీలు కల్పిస్తున్నాయని అన్నారు. ఖేలో ఇండియా అభియాన్ అత్యంత ప్రాథమిక స్థాయిలోనే యువతలో ప్రతిభను గుర్తిస్తోందని, అంతర్జాతీయ స్థాయికి వారు ఎదిగేందుకు వారికి తగిన శిక్షణ ఇస్తోందని ఆయన అన్నారు.ఇటీవల ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్ లో ఇండియా పనితీరు గురించి ప్రస్తావిస్తూ, క్రీడారంగంలో ఇండియా ఉన్నత స్థాయికి చేరుకుంటుండడానికి ఇది నిదర్శనమని అన్నారు. గ్రామాలు, చిన్న పట్టణాలలో మౌలిక క్రీడా సదుపాయాల కల్పనతో పట్టణాలనుంచి ఎందరో క్రీడాకారులు వస్తున్నారని ఆయన గుర్తుచేశారు.

నూతన విద్యావిధానంలో క్రీడలకు ప్రాధాన్యతనివ్వడం జరిగిందని ప్రధానమంత్రి తెలిపారు. సైన్సు , కామర్సు, ఇతర అధ్యయనాల లాగే క్రీడలను కూడా ఇప్పుడు అదే కేటగిరీలో ఉంచడం జరిగిందని చెప్పారు. గతంలో క్రీడలను ఇతరేతర వ్యాపకాలుగా భావించేవారని కానీ ఇవాళ క్రీడా పాఠశాలలలో ఇది ఒక సరైన సబ్జెక్టుగా ఉందని అన్నారు. క్రీడా వాతావరణంలో క్రీడలు, క్రీడల యాజమాన్యం, క్రీడలకు రాయడం, స్పోర్ట్స్ సైకాలజీ వంటివి ఎన్నో ఉన్నాయని, ఇవి కొత్త అవకాశాలను కల్పిస్తాయని అన్నారు.

క్రీడలవైపు వెళ్లడం సరైన నిర్ణయమని ఇది సమాజంలో విశ్వాసం కల్పిస్తుందని ఆయన అన్నారు. వనరులతో, క్రీడల సంస్కృతి ఒక రూపు దాలుస్తుందని, ఈ దిశగా క్రీడల విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. మీరట్ క్రీడా సంస్కృతి గురించి మాట్లాడుతూ ఆయన, మీరట్ నగరం క్రీడల ఉత్పత్తులను 100కుపైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నదని చెప్పారు. ఈ రకంగా మీరట్ స్థానికతకు గళం విప్పడమే కాక, స్థానికం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందని ఆయన చెప్పారు. స్పోర్ట్స్ క్లస్టర్లతో దేశాన్ని ఈ రంగంలో ఆత్మ నిర్భర్ చేయాల్సిన అవసరం గురించి ఆయన తెలిపారు.

ఉత్తరప్రదేశ్ లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పలు విశ్వవిద్యాలయాలను నెలకొల్పుతున్నదని ప్రధానమంత్రి ప్రస్తావించారు. గోరఖ్‌పూర్‌లో మహాయోగి గురు గోరఖ్ నాథ్ ఆయుష్ యూనివర్సిటీ, ప్రయాగ్‌రాజ్ లో డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ లా యూనివర్సిటీ, లక్నోలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్సెస్, అలీఘడ్ లో రాజా మహేంద్ర ప్రతాప్ సింగ్ స్టేట్ యూనివర్సిటీ, షహరాన్ పూర్ లో మా షాకుంబరి యూనివర్సిటీ, మీరట్ లో మేజర్ ధ్యాన్ చంద్ యూనివర్సిటీ లు ఏర్పాటయ్యాయని అన్నారు. మన లక్ష్యం స్పష్టం, యువత రోల్ మోడల్స్ గా మారడం మాత్రమే కాదు, వారి రోల్ మోడల్స్‌ను గుర్తించాలన్నారు.

స్వమిత్వ పథకం కింద 23 లక్షలకు పైగ టైటిల్స్ (ఘరౌని) 75 జిల్లాలలో ఇవ్వడం జరిగిందని, పి.ఎం. కిసాన్ సమ్మాన్ నిధికింద రాష్ట్ర రైతులు కోట్లాది రూపాయలు తమ ఖాతాలలో అందుకున్నారని ప్రధానమంత్రి తెలిపారు. చెరకు రైతులు రికార్డు స్థాయిలో చెల్లింపులు అందుకుని ప్రయోజనం పొందారని కూడా ఆయన అన్నారు. ఇలాగే, ఉత్తరప్రదేశ్ నుంచి 12 వేల కోట్ల రూపాయల విలువగల ఇథనాల్ ను కొనుగోలు చేసినట్టు ప్రధానమంత్రి తెలిపారు.

ప్రభుత్వం పాత్ర ఒక సంరక్షకుడి పాత్ర లాంటిదని ఆయన అన్నారు. ప్రతిభ కల వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలని అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. ఐటిఐ లలో శిక్షణ పొందిన వేలాది మంది యువత పెద్ద కంపెనీలలో ఉపాధి పొందారని అన్నారు. నేషనల్ అప్రెంటీస్ షిప్ పథకం కింద, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద లక్షలాది మంది యువత ప్రయోజనం పొందారని ప్రధానమంత్రి తెలిపారరు. గంగా ఎక్స్‌ప్రెస్ వే, రీజనల్ రాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్, మెట్రో ద్వారా మీరట్ అనుసంధానతకు హబ్‌గా మారుతున్నదని ప్రధానమంత్రి అన్నారు.

# గగనతల క్రీడల విధానం ముసాయిదా విడుదల

న్యూఢిల్లీ, జనవరి 3:జాతీయ గగనతల క్రీడల విధానం (ఎన్.ఎ.ఎస్.పి.) ముసాయిదాను కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ప్రజాభిప్రాయం కోరుతూ ఈ ముసాయిదాను విడుదల చేశారు. పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ వెబ్.సైట్లో ఈ ముసాయిదా అందుబాటులో ఉంటుంది. ముసాయిదా కోసం ఈ కింది లింకును సంప్రదించవచ్చు:

గగనతల క్రీడా ప్రపంచంలో అగ్రశ్రేణి దేశంగా రాణించగలిగే శక్తిసామర్థ్యాలు భారతదేశానికి ఉన్నాయి. సువిశాలమైన భౌగోళిక విస్తీర్ణం, విభిన్నమైన నైసర్గిక స్వరూప స్వభావాలు, సానుకూలమైన వాతావరణ పరిస్థితులు భారతదేశానికి ఉన్నాయి. భారతదేశానికి భారీ సంఖ్యలో జనాభా ఎక్కువ. అందులోనూ యువజనుల జనాభా కూడా సమృద్ధిగానే ఉంది. సాహస క్రీడలు విమానయానం వంటి విభిన్న అంశాలతో కూడిన సంస్కృతి దేశంలో క్రమంగా పెరుగుతూ వస్తోంది. గగనతల క్రీడలు, క్రీడా కార్యకలాపాలతో ప్రత్యక్షంగా వచ్చే రెవెన్యూ మాత్రమే కాక, విభిన్నరకాలైన ప్రయోజనాలు కూడా దేశానికి సమకూరుతున్నాయి. పర్యాటకం, మౌలిక సదుపాయలు, స్థానికంగా ఉపాధి కల్పన వంటి రూపాల్లో ఈ ప్రయోజనాలు సమకూరుతున్నాయి. ప్రత్యేకించి కొండ ప్రాంతాల్లో ఈ ప్రయోజనాలు మరింత ఎక్కువగా ఒనగూడే అవకాశాలున్నాయి. గగనతల క్రీడా కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయడం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న గగనతల క్రీడా నిపుణులను, పర్యాటకులను మనదేశంవైపు ఆకర్షించేందుకు అవకాశం ఉంటుంది.

ఈ కారణాలన్నింటివల్లనే గగనతల క్రీడా రంగాన్ని ప్రోత్సహించాలని భారత ప్రభుత్వం గట్టిగా సంకల్పించింది. అందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇందుకోసం, గగన క్రీడలను సురక్షితంగా, అందుబాటు యోగ్యంగా, ఆనందదాయంగా, సుస్థిరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన వ్యవస్థలను, వివిధ ప్రక్రియలను మరింత సరళతరం, పారదర్శకం చేయాల్సి ఉంది; అలాగే, నాణ్యత, భద్రత వంటి అంశాలపై మరింత దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది; గగనతల క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, శిక్షణ, అవగాహనా కల్పనకోసం పెట్టుబడులను సానుకూలంగా మార్చుకోవలసిన అవసరం కూడా ఉంది.

ఇందులో భాగంగా తొలి ప్రయత్నంగా, జాతీయ. గగనతల క్రీడల విధానం ముసాయిదా (ఎన్.ఎ.ఎస్.పి 2022)కు ప్రభుత్వం రూపకల్పన చేసింది. విధాన నిర్ణాయకులు, గగనతల క్రీడల అభ్యాసకులు, సాధకులు, ప్రజలనుంచి సేకరించిన సమాచారం ప్రాతిపదికగా ఈ ముసాయిదాను తయారు చేశారు. ఈ ముసాయిదా ఎప్పటికప్పుడు పరిస్థితులను బట్టి మారుతూ ఉంటుంది. క్రమం తప్పకుండా అవసరమైన సవరణలు చోటుచేసుకుంటూ ఉంటాయి.

## నాసిక్‌లో సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించిన కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్

న్యూఢిల్లీ, జనవరి 3:కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ రేపు అనగా 3 జనవరి 2022న నాసిక్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం కింద వెల్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

ఈ సందర్భంగా జరిగే సమావేశంలో కేంద్ర మంత్రి డాక్టర్ పవార్ కూడా ప్రసంగించనున్నారు. ఈ సమావేశానికి నాసిక్ సంరక్షక మంత్రి శ్రీ ఛగన్ భుజ్‌బల్, నాసిక్ మేయర్ శ్రీ సతీష్ కులకర్ణి, ఎంపీ డాక్టర్ సుభాష్ భామ్రే, ఎంపీ శ్రీ హేమంత్ గాడ్సేతో పాటు ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

ముంబై, పూణే మరియు నాగ్‌పూర్ తర్వాత మహారాష్ట్రలో నాసిక్ సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించిన నాల్గవ నగరం కానుంది.

ఇందులో మరిన్ని నగరాలను చేర్చడానికి మరియు సిజిహెచ్ఎస్ సేవల సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 10 జూన్ 2021న నాసిక్‌లో కొత్త అల్లోపతిక్ వెల్‌నెస్ సెంటర్‌ను మంజూరు చేసింది. ప్రస్తుతం భారతదేశ వ్యాప్తంగా ఉన్న 74 సిజిహెచ్ఎస్‌ల పరిధిలో 38.5 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు.

నాసిక్‌లోని సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ప్రభుత్వ కార్యాలయాలు మరియు నివాసాల మధ్య ఉంది. మరియు రోడ్డు మరియు రైల్వే నెట్‌వర్క్ ద్వారా కూడా బాగా అనుసంధానించబడి ఉంది. నాసిక్‌లోని వెల్‌నెస్ సెంటర్ ఔషధాల సమస్యను తీర్చడంతో పాటు ప్రభుత్వ మరియు ఎంపానెల్డ్ ఆసుపత్రులలో ఇండోర్ ట్రీట్‌మెంట్, ప్రభుత్వ మరియు ఎంపానెల్డ్ కేంద్రాలలో పరిశోధనలు, పెన్షనర్లు మరియు ఇతర గుర్తించబడిన లబ్ధిదారులకు ఎంపానెల్డ్ సెంటర్‌లలో చికిత్స కోసం నగదు రహిత సదుపాయం, పొందిన చికిత్స ఖర్చుల రీయింబర్స్‌మెంట్‌తో సహా ఓపీడీ చికిత్సను అందిస్తుంది. అలాగే ప్రభుత్వంలో /ఎమర్జెన్సీ కింద ప్రైవేట్ హాస్పిటల్స్, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాలు, ఉపకరణాలు మొదలైన వాటి కొనుగోలు కోసం చేసిన ఖర్చుల రీయింబర్స్‌మెంట్ మరియు కుటుంబ సంక్షేమం, ప్రసూతి మరియు శిశు ఆరోగ్య సేవలను కూడా అందిస్తుంది.

ఈ వెల్‌నెస్ సెంటర్ నగరంలోని సుమారు 71,000 మంది ప్రస్తుతం పనిచేస్తున్న మరియు పెన్షనర్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సహా 1.6 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ముంబై లేదా పూణే వెళ్లి అక్కడి వెల్ నెస్ సెంటర్ లో చికిత్స పొందాల్సి వచ్చేది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు సమగ్ర వైద్యం అందించాలనే లక్ష్యంతో 1954లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం ప్రారంభించబడింది. సిజిహెచ్ఎస్ భారతదేశంలో ఏర్పాటు చేసిన ప్రజాస్వామ్యానికి సంబంధించిన నాలుగు స్తంభాలైన శాసనసభ, న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక మరియు పత్రికా విభాగాలను కవర్ చేసే అర్హతగల లబ్ధిదారుల ఆరోగ్య సంరక్షణ అవసరాలను అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్‌లకు మోడల్ హెల్త్ కేర్ ఫెసిలిటీ ప్రొవైడర్ మరియు పెద్ద మొత్తంలో లబ్ధిదారుల సంఖ్య మరియు ఆరోగ్య సంరక్షణను అందించే ఉదారమైన విధానం కారణంగా సిజిహెచ్ఎస్ అనేది ప్రత్యేకమైనది.

# సంక్రాంతి తర్వాత యాదాద్రికి సీఎం కేసీఆర్..

హైదరాబాద్, జనవరి 3:ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి ప్రారంభోత్సవ ముహూర్తం దగ్గరపడుతున్న నేపథ్యంలో పునర్నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. మార్చి 28న గర్భాలయంలో కొలువై ఉన్న నారసింహుడి దర్శనాలను భక్తులకు అందుబాటులోకి తెచ్చేలా సీఎం కేసీఆర్ త్వరలో యాదాద్రిలో పర్యటించి పునర్నిర్మాణ పనులపై కీలక సూచనలు చేయనున్నారు. సంక్రాంతి తర్వాత మంచి రోజులను చూసుకొని పనుల పురోగతిపై మరోసారి యాదాద్రికెళ్లి? అక్కడి నుంచే ఉన్నతస్థాయి సమీక్షించనున్నారని అధికారవర్గాలు తెలిపాయి. ఫిబ్రవరిలోగా కొండమీద పూర్తిగా కట్టడాలను నిర్మించి పెండింగ్ పనులు పూర్తి చేసేలా అధికారులు శ్రమిస్తున్నారు. ఆలయ గోపురాలపై కలశాల స్థాపనను వేదపండితులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. ఇందుకు దివ్యమైన ముహూర్తం దిశగా మహారాజగోపురం పనులను పరిశీలించేందుకు బృందాలు ఆలయ పరిసరాలను, పనులను సందర్శించి సీఎం కేసీఆర్‌కు నివేదిక అందజేయనున్నారు.

ఈ వారంలో క్షేత్రస్థాయిలో పనుల పరిశీలనకు మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డిలు యాదాద్రిలో పర్యటించే అవకాశం ఉంది. ఆ తర్వాత ఉద్ఘాటన పనుల ప్రారంభోత్సవాలు, మహాయాగానికి వసతులు, సౌకర్యాలు, వనరుల కల్పన, రుత్వికులకు సౌకర్యాలు, బసపై కీలక ఆదేశాలు జారీ చేయనున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భక్తులను ఆకర్షించేలా ఈ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా వెయ్యి సూట్లతో 250 కాటేజీల నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. వెయ్యి ఎకరాల్లో టెంపుల్ సిటీ నిర్మితమవుతోంది. రూ.6.90 కోట్లతో బస్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జలమండలి సహకారంతో రెండు రకాల డ్రైనేజీ వ్యవస్థచ నీటి వసతి ఏర్పాట్లు తుది దశలో ఉన్నాయి.

# ముంచెత్తనున్న కొత్త వేరియంట్.. వాస్తవ లెక్కలకంటే పది రెట్లు ఎక్కువ వ్యాప్తి..

న్యూఢిల్లీ, జనవరి 3:భారతదేశంలోకి మూడోవేవ్ ప్రవేశిస్తోంది. ఒమిక్రాన్ వేరియంట్ కారణంగా మళ్లీ రోజువారి కొవిడ్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం నమోదవుతున్న మొత్తం కేసుల్లో కొత్త వేరియంట్ రకం కేసులు కేవలం 2శాతం కంటే తక్కువేనన్న అధికారిక ప్రకటనలు మాటెలావున్నా, వాస్తవ గణాంకాలు చాలా అధికంగా ఉంటున్నాయి. త్వరలోనే ఒమిక్రాన్ సునామీ దేశాన్ని ముంచెత్తే ప్రమాదం ఉందని ఓ ఆంగ్ల జాతీయ చానల్ తన పరిశోధనలో పేర్కొంది. దేశంలో అధికారిక ఒమిక్రాన్ కేసుల సంఖ్య 1500గా అంచనా వేయబడుతోంది.కానీ ఇది వాస్తవానికి పది రెట్లు అధికం. దాదాపు 18000వేలకు చేరుకుని ఉండొచ్చు. ఇప్పుడి ఫుడే మనదేశం కూడా ప్రపంచ గణాంకాలను అనుసరిస్తోంది. కొన్నిదేశాల్లో నమోదవుతున్న కొత్త కేసుల్లో 90 శాతం కొత్త వేరియంట్ రకానివే ఉన్నాయి. ఒమిక్రాన్‌ను గుర్తించడానికి, వేగంగా జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షలు చేయడానికి మనవద్ద ల్యాబ్ సౌకర్యాలు తక్కువగా ఉన్నాయి. అందుచేత వాస్తవ గణాంకాలు వెల్లడవడం లేదు. ఈ వారం ఢిల్లీ, ముంబైలోని జీనోమ్ ల్యాబ్‌ల లెక్కల ప్రకారం, ఒమిక్రాన్ కేసులు 60 శాతం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇది కిందటి వారం 37 శాతంగా ఉండేదని ముంబైలోని మరో ఒమిక్రాన్ ల్యాబ్ తదుపరి నివేది కలో పేర్కొంది. అయితే, డెల్టా కంటే ఒమిక్రాన్ తక్కువ తీవ్రత ఇన్‌ఫెక్షన్లను కలిగిస్తున్న విషయమే కాస్తంత ఊరటనిచ్చే సంగతి.

డెల్టా కంటే మూడు నాలుగు రెట్లు వేగంగా వ్యాపించే లక్షణమున్న ఒమిక్రాన్ కారణంగా, అధిక జనాభా కలిగిన భారత దేశంలో రోజువారి కేసులు మునుపటి రికార్డులను అధిగమించొచ్చని తెలుస్తోంది. ప్రతి రోజు గరిష్టంగా 16 నుంచి 20 లక్షల కేసులు నమోదయ్యే అవకాశం ఉం దని వైరస్ వ్యాప్తి సరళినిబట్టి తెలుస్తోంది. దీని కారణంగా మన వైద్య వ్య వస్థ సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఆస్పత్రి పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, వైద్యులు, ఔషధాల లభ్యత తీవ్ర ఒత్తిళ్ల కు గురికావొచ్చు. ప్రతి 100 డెల్టా కేసుల్లో ఆరుగురు ఆస్పత్రిలో చేరితే, ఒమిక్రాన్ విషయంలో ఇది మూడింటికి పరిమితం కావొచ్చు. అయితే, కేసుల సంఖ్య నాలుగైదు రెట్లు అధికంగా ఉంటున్నందున, ఆస్పత్రిలో చేరేవారి సంఖ్య రోజుకు 60 వేలకు చేరుకునే అవకాశం ఉంది. వైరస్ వ్యాప్తి అధికంగా ఉన్నప్పటికీ, ఇది తక్కువ వ్యవధికే పరిమితం అవుతుందన్న విశ్లేషణలు సాను కూలాంశం. ఏదేమైనా భారతదేశం మునుముందు థర్డ్‌వేవ్ నుంచి భయానక పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు సంసిద్ధం కావాల్సిన అవసరం ఉందని తాజా అధ్యయనం సూచిస్తోంది.



# సంజయ్‌ను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే: నడ్డా

లక్నో, జనవరి 3:: శాంతియుతంగా జాగరణ చేస్తున్న తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్ లక్నోలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నడ్డా బండి సంజయ్ అరెస్ట్‌పై మాట్లాడారు. బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. బీజేపీ సాధిస్తున్న ప్రజా విజయాలను, బీజేపీకి లభిస్తున్న ప్రజాదరణను చూసి కేసీఆర్ సర్కారుకు పిచ్చెక్కిందన్నారు. పోలీసుల చర్యను నడ్డా తప్పుబట్టారు. అక్రమ కేసులకు భయపడబోమని, న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. మరోవైపు నిన్న అరెస్ట్ చేసిన బండి సంజయ్‌తో పాటు మరో నలుగురిని పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారు. కోవిడ్ ఉల్లంఘన, పోలీసు విధులకు ఆటంకం కలిగించారంటూ ఇప్పటికే బండి సంజయ్‌పై కేసులు పెట్టారు.

# ప్రధాని మోడీతో సీఎం జగన్ భేటీ



అమరావతి, జనవరి 3:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోడీతో సీఎం జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన ప్రధానితో చర్చించనున్నారు. ప్రధానితో సమావేశం అనంతరం సీఎం జగన్ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తో భేటీ కానున్నారు. అలాగే రేపు ఉదయం సీఎం జగన్ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి పలు అంశాలపై చర్చించనున్నారు.

# రైల్వేకు తత్కాల్ టికెట్ల ద్వారా రూ.511 కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ, జనవరి 3: భారతీయ రైల్వేకు తత్కాల్ టికెట్ల రూపంలో భారీగా ఆదాయం సమకూరుతోంది. కరోనా మహమ్మారి విలయతాండవం చేసిన 2020–21లో కూడా పెద్ద ఎత్తున ఆదాయం లభించింది. కరోనా నివారణ చర్యల్లో భాగంగా రైల్వే సర్వీసులను చాలా వరకు తగ్గించి నడిపించారు. దీంతో సహజంగానే తక్కువ టికెట్లు అందుబాటులో ఉంటాయి. దీంతో తత్కాల్ టికెట్లకు డిమాండ్ ఏర్పడి ఉండొచ్చు.

గడిచిన ఆర్థిక సంవత్సరంలో తత్కాల్ టికెట్ల రూపంలో రూ.403 కోట్లు సమకూరింది. ప్రీమియం తత్కాల్ టికెట్ల విక్రయం ద్వారా రూ.119 కోట్లు ఆదాయం లభించింది. మొత్తం మీద తత్కాల్ రూపంలో రూ.522 కోట్ల ఆదాయం చేకూరింది. ఇక డైనమిక్ ఫేర్ విధానం ద్వారా అదనంగా మరో రూ.511 కోట్లను రైల్వే శాఖ రాబట్టుకుంది. మధ్యప్రదేశ్ కు చెందిన చంద్రశేఖర్ గౌర్ సమాచార హక్కు చట్టం కింద రైల్వే శాఖ నుంచి ఈ సమాచారాన్ని సంపాదించి ప్రజల కోసం విడుదల చేశారు.

తత్కాల్ టికెట్లన్నవి ప్రయాణానికి ఒక రోజు ముందు అత్యవసరంగా తీసుకోవడానికి అందుబాటులో ఉండేవి. ప్రీమియం తత్కాల్ అనేవి మరింత అదనపు చార్జీలతో విక్రయిస్తారు. తత్కాల్ లో వెయిటింగ్ లిస్ట్ పై టికెట్లు ఇస్తారు. ప్రీమియం తత్కాల్ లో కన్ఫర్మ్ డ్ టికెట్లనే జారీ చేస్తారు. డైనమిక్ ఫేర్ అంటే సంబంధిత మార్గంలో టికెట్లకు ఉన్న డిమాండ్ ఆధారంగా టికెట్ ధరలను అప్పటికప్పుడు పెంచుతూ, తగ్గిస్తూ విక్రయించే విధానం.

# కార్పొరేషన్‌గా రాజధాని అమరావతి..నోటిఫికేషన్ జారీ

అమరావతి, జనవరి 3: ఏపీ రాజధాని అమరావతిని నగరపాలక సంస్థగా మార్చే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అమరావతి క్యాపిటల్ సిటీ కార్పొరేషన్ గా మార్చనుంది. రాజధానిలోని 19 గ్రామాలను ఈ కార్పొరేషన్ లో చేర్చనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ నుంచి నోటిఫికేషన్ విడుదలైంది. తుళ్లూరు మండలంలోని 16 గ్రామాలు, మంగళగిరి మండలంలోని 3 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించాలని ఉత్తర్వుల్లో అధికారులను ఆదేశించారు.

# స్వదేశీ విమాన వాహక నౌక ఐఏసీ (పి-71)/ విక్రాంత్‌ను సందర్శించిన ఉపరాష్ట్రపతి



న్యూఢిల్లీ, జనవరి 3:గౌరవ భారత ఉపరాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు ఈ రోజు (02 జనవరి 2022న), కొచ్చి నగరంలో గల 'కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో నిర్మాణపు అధునాతన దశలో ఉన్న స్వదేశీ విమాన వాహక నౌక (ఐఏసీ) 'విక్రాంత్'ను సందర్శించారు. పర్యటనలో భాగంగా గౌరవభారత ఉపరాష్ట్రపతికి ప్రాజెక్ట్ యొక్క విశిష్టత, నిర్మాణ పురోగతి గురించి అధికారులు వివరించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' జ్ఞాపకార్థం 2022 ఆగస్టుకు ముందే ఈ ఓడ డెలివరీ, కమీషన్ కోసం చేస్తున్న ప్రయత్నాల గురించి కూడా ఉపరాష్ట్రపతికి వివరించారు. ఒక విమాన వాహక నౌకను రూపొందించడంలో మరియు నిర్మించడంలో దేశం యొక్క సామర్థ్యాన్ని గౌరవనీయమైన ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. 'ఆత్మ నిర్భర్త' లేదా స్వావలంబన భారతదేశం నిమిత్తం మా అన్వేషణలో ఇది ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ అని ఉపరాష్ట్రపతి అన్నారు.

## ఒక బలమైన ఉత్ప్రేరకంగా..

భారతదేశ నావికా దళానికి హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఒక బలీయమైన నివాస సముద్ర శక్తి; ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ బ్యాటిల్ గ్రూప్ దాని కార్యకలాపాల భావనకు కేంద్రంగా ఉంది. విక్రాంత్ నౌక భారత నౌకాదళానికి అవసరమైన సౌలభ్యం, చలన శీలత, రీచ్ (అందుబాటు)తో జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా తగిన పోరాట శక్తిని అందిస్తుంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి మరియు స్థిరత్వానికి ఒక బలమైన ఉత్ప్రేరకంగా కూడా ఉపయోగపడుతుంది. ఈ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కూడా వ్యూహాత్మక మరియు సాంకేతిక ఔన్నత్యాన్ని కలిగి ఉంది. ఇది యుద్ధ నౌకల రూపకల్పనతో పాటునిర్మాణ రంగంలో పరాకాష్టగా పరిగణించబడుతుంది. స్వదేశీ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ నిర్మాణంతో, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ రూపకల్పన మరియు నిర్మాణానికి సముచిత స్వదేశీ సామర్థ్యం ఉన్న దేశాల ఎంపిక సరసన భారతదేశం చేరనుంది. ఈ విమాన వాహక నౌకలో భారత పారిశ్రామిక సంస్థలు, సుమారు వంద ఎంఎస్‌ఎంఈలతో తయారు చేయబడిన ఇతర పరికరాలు, పలు సిస్టమ్స్‌తో పాటు ఉక్కు వంటి స్వదేశీ పదార్థాలు పెద్ద సంఖ్యలో విక్రాంత్ నిర్మాణంలో వినియోగించడమైంది. ఈ యుద్ధవాహక నౌక స్వదేశీ నిర్మాణం షిప్‌యార్డ్‌లోనే కాకుండా బాహ్యంగా ప్రాజెక్ట్‌కు మద్దతునిచ్చే అనేక ఇతర పరిశ్రమలకు కూడా ఉపాధి అవకాశాలను సృష్టించింది. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థపై "ప్లాగ్ బ్యాక్" ప్రభావం చూపింది. ఈ ఐఏసీ నిర్మాణంలో సంవత్సరానికి దాదాపు 2000 షిప్‌యార్డ్, 13000 మంది నాన్–యార్డ్ సిబ్బంది నియమించడమైంది. ఈ పర్యటనలో, గౌరవనీయులైన ఉపరాష్ట్రపతితో పాటు గౌరవనీయులైన కేరళ గవర్నర్ శ్రీ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ సదరన్ నావల్ కమాండ్ రియర్ అడ్మిరల్ ఆంటోనీ జార్జ్, ఎన్ఎం, వీఎస్ఎం, సీఎండీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (అూఐ) శ్రీ మధు ఎస్ నాయర్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటుగా నౌకాదళం, సీఎస్ఎల్ ఇతర సీనియర్ అధికారులు.కూడా పాల్గొన్నారు.

## కోవిడ్ ప్రతిబంధకాలు ఎదురైనా..

పనుల పరిశీలన సందర్భంగా వాహక నౌక చుట్టూ తిరిగే సమయంలో స్వదేశీ సాంకేతికతలు, సామర్థ్యాల సహకారం గురించి గౌరవ ఉపరాష్ట్రపతికి అధికారులు తెలియజేశారు. దీనిపై ఉపరాష్ట్రపతి సంతృప్తిని వ్యక్తం చేశారు. మనదేశ స్వదేశీ యుద్ధనౌక నిర్మాణ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి భారత నావికాదళం, కొచ్చిన్ షిప్‌యార్డ్ చేస్తున్న కృషిని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభినందించారు. కోవిడ్ సంబంధిత ప్రతిబంధకాలు ఎదురైనప్పటికీ.. ఇప్పటివరకు నౌక నిర్మాణంలో జరిగిన తగిన పనుల పురోగతి పట్ల గౌరవ ఉపరాష్ట్రపతి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతర గౌరవనీయులైన ఉపరాష్ట్రపతి 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా నేవల్ ఫిజికల్ ఉ ఓషనోగ్రాఫిక్ లాబొరేటరీని సందర్శించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్‌న్ కూడా ఆవిష్కరించారు. అతను టోవ్డ్ అర్రే ఇంటిగ్రేషన్ ఫెసిలిటీకి కూడా శంకుస్థాపన చేశారు. నేవీకి ఆటోమేటెడ్ సోనార్ ట్రైనర్‌ను అందజేశారు. గౌరవ ఉపరాష్ట్రపతి కేరళలో మూడు రోజుల పర్యటనలో ఉన్నారు. లక్షద్వీప్ పర్యటన తర్వాత ఆదివారం ఉదయం కొచ్చి నౌకాదళ విమానాశ్రయానికి చేరుకున్నారు. అంతకు ముందు రోజు ఉపరాష్ట్రపతి గౌరవార్థం ఐఎన్ఎస్ గరుడ వద్ద ఉత్సవంగా 100 మంది గార్డులు పరేడ్‌ను నిర్వహించారు.

# జమ్మూ కాశ్మీర్ లో జిల్లా స్థాయి పాలనా సూచీ ఉండాలి: కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్



న్యూఢిల్లీ, జనవరి 3:జమ్మూ కాశ్మీర్ త్వరలో జిల్లా స్థాయి సుపరిపాలన సూచికను కలిగి ఉన్న దేశంలో మొదటి కేంద్ర పాలిత ప్రాంతంగా మారనుంది.

కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ డిపార్ట్‌మెంట్ (డి ఏ ఆర్ పి జి)కి కొత్తగా నియమితులైన సెక్రటరీ, వి. శ్రీనివాస్ నుంచి ఒక నవీకరణను స్వీకరించిన తర్వాత కేంద్ర సైన్స్ & టెక్నాలజీ సహాయ (స్వతంత్ర బాధ్యత) మంత్రి, ఎర్త్ సైన్సెస్ సహాయ (స్వతంత్ర బాధ్యత) మంత్రి, ప్రధాన మంత్రి కార్యాలయం సహాయ మంత్రి, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ , స్పేస్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ విషయం తెలిపారు. జమ్మూ కాశ్మీర్ లో కేంద్రం జిల్లా గుడ్ గవర్నెన్స్ ఇండెక్స్ (డి జి జి ఐ)ని ఏర్పాటు చేస్తుందని , పరిపాలనా సంస్కరణలు , ప్రజా ఫిర్యాదుల విభాగం (డిఎ ఆర్ పి జి) ఈ పనిని నిర్వహిస్తుందని చెప్పారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సిజిజి) హైదరాబాద్ సాంకేతిక మద్దతుతో ప్రతిపాదిత ఇండెక్స్ ఫ్రేమ్ వర్క్ ఖరారు అయింది.

దేశంలోని ఇతర రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాలలో అనుసరించే ఉత్తమ పాలనా విధానాలే జమ్మూ కాశ్మీర్ లో ప్రతిబింబించాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ అభిమతమని కేంద్ర మంత్రి అన్నారు.

చాలా కాలంగా కొన్ని రాజ్యాంగ, పరిపాలనా పరమైన అడ్డంకుల ఫలితంగా జమ్మూ కాశ్మీర్ లో డివోపిటి, ఎఆర్ పిజి కేంద్ర నిబంధనలు అనేకం వర్తించ లేదని, అయితే గత రెండు సంవత్సరాలుగా పని సంస్కృతిని మార్చడానికి, "గరిష్ట పాలన–కనీస ప్రభుత్వం ''మంత్రాన్ని అనుసరించడానికి వేగవంతమైన ప్రయత్నం జరిగిందని ఆయన అన్నారు.

ఇది మోదీ ప్రభుత్వం 2014 లో అధికారం లోకి వచ్చినప్పటి నుంచి కేంద్రం , రాష్ట్రాలకు ఈ మంత్రం మార్గదర్శక సూత్రంగా ఉంది.

జిల్లా స్థాయిలో సుపరిపాలన సూచిక జమ్మూ కాశ్మీర్ లోని 20 జిల్లాల్లో ప్రతి జిల్లా సకాలం లో కార్యాలయ ఫైళ్ల పరిష్కారం, పారదర్శకత పెరగడం, జవాబుదారీతనం పెరగడం ,పౌరుల భాగస్వామ్యం పెరగడం ద్వారా

దేశం లోని కొన్ని ఉత్తమ నిర్వహణ జిల్లాల స్థాయికి ఎదగడానికి వీలు కల్పిస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు.

ఈ సుపరిపాలన విధానాల శ్రీను తహసీల్ , బ్లాక్ స్థాయి వరకు ముందుకు తీసుకెళ్ల డం తదుపరి చర్య అని ఆయన చెప్పారు.

డిజిజిఐ ఫ్రేమ్ వర్క్ లో వ్యవసాయం, దాని అనుబంధ రంగం, వాణిజ్యం , పరిశ్రమ, మానవ వనరుల అభివృద్ధి, ప్రజారోగ్యం, పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అండ్ యుటిలిటీస్, ఎకనామిక్ గవర్నెన్స్, వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్, పబ్లిక్ సేఫ్టీ ఉ జ్యుడీషియరీ , సిటిజన్ సెంట్రిక్ గవర్నెన్స్ వంటి 10 రంగాలలో పంపిణీ చేయబడ్డ అభివృద్ధి , జిల్లా పరిపాలన కు సంబంధించిన విభిన్న అంశాల నుంచి తీసుకున్న 58 ఇండికేటర్ లు ఉన్నాయి.

జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వ జిల్లా అధికారులు, విద్యావేత్తలు, విషయ నిపుణులు మొదలైన వారితో వరుస సంప్రదింపుల తరువాత ఈ సూచికల ను ఖరారు చేసారు. ప్రామాణికమైన ప్రచురితమైన డేటా , ఇతర కీలక సూత్రాల లభ్యతను పరిశీలిస్తే, సూచికల సెట్ 135 నుండి 58 వరకు గల పెద్ద జాబితా నుండి ఖరారు చేయబడింది.

ఇండెక్స్ , ర్యాంక్ ను లెక్కించడానికి, ఖరారు చేసిన 58 సూచికల ఆధారంగా జిల్లాల పనితీరుపై, డేటా సేకరణ యొక్క విస్తృతమైన వ్యాయామం తరువాత కఠినమైన డేటా శానిటైజేషన్ చేపట్టబడింది

ఇండెక్స్ ,ర్యాంక్‌ను గణించడానికి ఖరారు చేసిన 58 సూచికల ఆధారంగా జిల్లాలు– వాటి పనితీరుపై, కఠినతరమైన డేటా వడబోట తో విస్తృతమైన డేటా సేకరణ ప్రక్రియ జరిగింది. ప్రామాణిక , పరీక్షించిన డేటా సాధారణీకరణ ,స్కోరింగ్ పద్ధతులను ఉపయోగించి తుది సూచిక గణన ప్రక్రియ జరుగుతోంది.

దీని ఫలితంగా డివిజన్ల వారీగా జిల్లాల వారీగా ర్యాంకులు బయటకు వస్తాయి. సంపూర్ణ 10 సెక్టార్ల ఆధారంగా జిల్లాల సమగ్ర ర్యాంక్ ఉంటుంది, డిజిజిఐ సూచిక వారీగా జిల్లాల పనితీరుపై ఒక విండోను కూడా అందిస్తుంది.

# బెంగళూరు - హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్... రైల్వే శాఖ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 3:దేశంలో ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కేంద్రం వడివడిగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా దేశంలో ఇప్పటికే ఎనిమిది కారిడార్లలో బుల్లెట్ రైళ్లు అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. కాగా భవిష్యత్తు అవసరాలు, పెరుగుతున్న డిమాండ్‌ని పరిగణలోకి తీసుకుని మరో నాలుగు కారిడార్లలో బుల్లెట్ ట్రైన్‌ని పరుగులు పెట్టించాలని నిర్ణయం తీసుకుంది.

ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా విరాజిల్లుతున్నా బుల్లెట్ ట్రైన్ల పరంగా ఇండియా ఇప్పటికీ వెనుకబడే ఉంది. ఆసియాలో బిగ్గెస్ట్ ఎకానమీలైన చైనా, జపాన్‌లలో ఇప్పటికే బుల్లెట్ రైళ్లు పరుగులు పెడుతున్నాయి. దీంతో బుల్లెట్ ట్రైన్ కలిగిన దేశాల సరసన ఇండియాను నిలపపాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.

బుల్లెట్ ట్రైన్ కలను సాకారం చేసేందుకు రైల్వేశాఖ ప్రాథమికంగా 8 రూట్లలో బుల్లెట్ రైళ్లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఇందులో ముంబై – సూరత్ – వడోదర – అహ్మదాబాద్, ఢిల్లీ – నోయిడా – ఆగ్రా – కాన్పూర్ – లక్నో – వారణాసి, ఢిల్లీ – జైపూర్ – ఉదయ్‌పూర్ – అహ్మదాబాద్, ముంబై – నాసిక్ – నాగ్‌పూర్, ముంబై – పూణే – హైదరాబాద్, చెన్నై – బెంగళూరు – మైసూర్, ఢిల్లీ – ఛండీగడ్ – లూథియానా – జలంధర్ – అమృత్‌సర్, వారణాసి – పాట్నా – హౌరా మార్గాలు ఉన్నాయి.

మొదట ప్రతిపాదించిన 8 కారిడార్లలో ముంబై – అహ్మాబాబాద్ రూట్‌లో 508 కిలోమీటర్ల నిడివితో బుల్లెట్ రైలు మార్గం నిర్మాణ పనులు సాగుతున్నాయి. దీని కోసం ముంబై అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ పేరుతో ప్రత్యేక మిషన్ ఏర్పాటు చేశారు. మరోవైపు ముంబై – హైదరాబాద్ బుల్లెట్ రైలు మార్గానికి సంబంధించి భూ సేకరణ పనులు షురూ అయ్యాయి. మిగిలిన ప్రాజెక??టులకు సంబంధించి డీపీఆర్‌లు రెడీ అయ్యాయి.

ప్రస్తుతం డీపీఆర్‌లు రెడీ అయిన ప్రాజెక్టులతో పాటు మరో నాలుగు మార్గాల్లో బుల్లెట్ రైలుని అందుబాటులోకి తేవాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందులో బెంగళూరు – హైదరాబాద్ (618 కి.మీ), నాగ్‌పూర్ – వారణాసి (855 కి.మీ), పట్నా – గువహటి (850 కి.మీ), అమృత్‌సర్ – పఠాన్‌కోట్ – జమ్ము (192 కి.మీ) మార్గాలను ఉన్నాయి. వీటిని ఇప్పటికే నేషనల్ రైల్ ప్లాన్ 2022లో చేర్చారు. త్వరలో ఈ మర్గాల్లో బుల్లెట్ రైల్ నిర్మాణానికి సంబంధించి డీపీఆర్‌లు సిద్ధం చేయనున్నారు.

కేంద్రం అమలు చేస్తోన్న బుల్లెట్ రైలు ప్రాజెక్టులో గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలు గణనీయంగా లబ్ధి పొందనుండగా దక్షిణాది రాష్ట్రాలైన కేరళా, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు ఒడిషా, ఝార్ఖండ్‌లను పూర్తిగా విస్మరించారు. తమిళనాడు, మధ్యప్రదేశ్, జమ్ము కశ్మీర్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు కంటితుడుపు చర్యలా బుల్లెట్ రైలు ప్రాజెక్టులు ఉన్నాయి.

# పెద్దలు పెళ్ళికి నిరాకరించారని ప్రేమ జంట ఆత్మహత్య

ఆదిలాబాద్, జనవరి 3:: పెద్దలు పెళ్ళికి నిరాకరించారని యువ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. జిల్లాలోని వాంకిడి మండలం రాంనగర్ గ్రామానికి చెందిన నౌగడే శ్రీకాంత్ (22), గీత(19) గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల వారి ప్రేమ విషయం ఇంట్లో పెద్దలకు చెప్పి వివాహం చేయమని కోరారు. దీంతో అబ్బాయి ఇంట్లో ఒప్పుకున్నప్పటికి ,గీతా కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. చివరకు ఈ విషయం గ్రామ పెద్దలు వరకు వెళ్లింది. దీంతో ఇరు కుటుంబాల వారికి నచ్చజెప్పి, కొంత సమయం వేచి చూడాల్సిందిగా పెద్దలు చెప్పారు

కొన్ని రోజులు వేచి చూసిన శ్రీకాంత్, గీతలు ఇక తమకు వివాహం జరపరని మనస్తాపానికి గురై గత సోమవారం ఇంటి నుంచి వెళ్ళిపోయారు. అయితే సోమవారం పొలం పనుల కోసం అకిని గ్రామ సమీపంలోని పత్తి చేనుకు వెళ్ళిన కూలీలకు ప్రేమ జంట చెట్టుకు ఉరి వేసుకుని శవాలై కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. శవాలు కుళ్ళిన స్థితిలో ఉండటంతో 3 రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్న 108 వాహనాలు

ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలను నిలిపే 108 వాహనాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతం మొదలు? పట్టణాల్లోని పేద, ధనిక అనే భేదం లేకుండా ఎవరూ ఫోన్ చేసినా నిమిషాల్లో వచ్చి ఆదుకుంటాయి 108 వాహనాలు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలు అవసరమయ్యే రోగుల సంఖ్య పెరుగుతుండగా అందుకు తగిన సంఖ్యలో అంబులెన్స్‌లు అందు బాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే ఫోన్ చేసిన నిమిషాల్లోనే కుయ్ కుయ్ అంటూ అంబులెన్స్ వస్తుందన్న భరోసా ఇప్పుడు లేదు.

ప్రమాదానికి గురైన తర్వాత ప్రతీ క్షణం ఎంతో విలువైంది. అయితే ఆ విలువైన క్షణాల్లో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించే108 వాహనాలు తగినన్ని సంఖ్యలో అందుబాటులో లేకపోవడంతో ఎన్నో కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోయి రోడ్డున పడుతున్నాయి.

## హైదరాబాద్‌లో సమస్య మరింత తీవ్రం?

రాష్ట్ర వ్యాప్తంగా 108 వాహనాలకు తీవ్ర కొరత నెలకొనగా. ప్రత్యేకించి హైదరాబాద్‌లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రతి 5 కి.మీకు ఒకటి, నగర శివార్లలో 25 కి.మీ. ఒక 108 అందుబాటులో ఉంది. అయితే నగరంలోని అంబులెన్స్‌ను ఆస్పత్రుల నుంచి వేరే ఆస్పత్రికి రిఫరల్ కేసుల తరలింపుకే ఎక్కువగా వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రమాద సమయాల్లో క్షతగాత్రులను కాపాడేందుకు 108 వాహనాల కొరత నగరంలో రోజు రోజుకు తీవ్ర మవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం జగన్



అమరావతి, జనవరి 3:సీఎం జగన్ రైతు భరోసా నిధులను విడుదల చేశారు. రైతు భరోసా– పీఎం కిసాన్ కింద మూడోవిడత పెట్టుబడి సాయం జమ నిధులు మొత్తం 50,58,489 మందికి రూ.1,036 కోట్లు జమ చేశారు. సీఎం జగన్ తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ఈ మొత్తాన్ని రైతు భరోసా సాయాన్ని బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ మొత్తంతో కలిపి 2021–22 సీజన్‌లో రూ.6, 899.67 కోట్లు జమ కానుండగా, గడిచి న మూడేళ్లలో ఈ పథకం కింద రూ. 19,812.79 కోట్లు పెట్టుబడి సాయం అందిస్తోంది. వైఎస్సార్ రైతుభరోసా పీఎం కిసాన్ కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున అర్హులైన రైతులకు పెట్టుబడి సాయం అందిస్తోంది.వైస్సార్సీపీ ఎన్నికల హామీలో భాగంగా రైతు భరోసా పథకాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 13,500 సాయం విడతల వారీగా అందిస్తోంది. ఇందులో మొదటి విడతగా ఖరీఫ్ పంట వేసే ముందు అంటే మే నెలలో రూ. 7,500, రెండవ విడతగా అక్టోబర్ నెల ముగిసేలోపే ఖరీఫ్ పంట కోత సమయం, రబీ అవసరాల కోసం రూ. 4,000, మూడవ విడతగా ధాన్యం ఇంటికి చేరే సంక్రాంతి వేళ జనవరి నెలలో రూ. 2,000 చొప్పున ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తోంది.




# 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు కోవిడ్ వాక్సిన్ను సద్వినియోగం చేసుకోవాలి!

## -వేములవాడ అర్బన్ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు,జడ్పీటీసీ మ్యాకల రవి



రాజన్న సిరిసిల్ల, జనవరి 3(నేటినిజం ప్రతినిధి):కోవిడ్ వాక్సిన్ ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ అర్బన్ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు అన్నారు. సోమవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని అర్బన్ వంద పడకల ఆస్పత్రిలో 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు కరోనా వాక్సిన్ టీకా పంపిణీ కార్యక్రమాన్ని జడ్పీటీసీ మ్యాకల రవి తో కలిసి ఎంపీపీ బుర్ర వజ్రమ్మ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలందరూ ఈ కరోనా వాక్సిన్ తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు టీకాను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కరోనా విషయంలో ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సూచించారు. కోవిడ్ టీకా తీసుకున్న తర్వాత కూడా సరైనజాగ్రత్తలనుతీసుకోవాలన్నారు. మాస్కులు ధరించడం, సోషల్ డిస్టాన్స్ పాటించాలని కోరారు.ఒమిక్రాన్ కరోనా విజృంభిస్తున్నందున ప్రజలు నిర్లక్ష్యంగా ఉండకుండా ఓమిక్రాన్ రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. .

ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రేగులపాటి మహేష్ రావు,డాక్టర్లు, అగ్రపెల్లి మాజీ సర్పంచ్ రాజయ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 5న పంజాబ్‌ను సందర్శించనున్న ప్రధాన మంత్రి

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2022వ సంవత్సరం లో జనవరి 5వ తేదీ నాడు పంజాబ్ లోని ఫిరోజ్ పుర్ ను సందర్శించనున్నారు. 42,750 కోట్ల రూపాయల విలువ చేసే పలు అభివృద్ధి పథకాల కు ఆ రోజు న మధ్యాహ్నం సుమారు ఒంటి గంట వేళ కు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఆ పథకాల లో దిల్లీ-అమృత్ సర్-కాట్ రా ఎక్స్ ప్రెస్ వే; అమృత్ సర్ - ఊనా సెక్షను ను 4 దోవలు కలిగివుండేది గా ఉన్నతీకరించడం; ముకేరియాం- తల్ వాడా కొత్త బ్రాడ్ గేజ్ రైలు మార్గం; ఫిరోజ్ పుర్ లో పిజిఐ శాటిలైట్ సెంటరు, కపుర్ తలా లోను, హోశియార్ పుర్ లోను రెండు వైద్య కళాశాల లు భాగం గా ఉన్నాయి.

దేశవ్యాప్తం గా సంధానాన్ని మెరుగుపరచాలన్న ప్రధాన మంత్రి నిరంతర ప్రయాస పంజాబ్ రాష్ట్రం లో అనేక జాతీయ రహదారుల అభివృద్ధి కి బాట ను పరచింది. ఫలితం గా రాష్ట్రం లో జాతీయ రహదారుల మొత్తం పొడవు ను 2014వ సంవత్సరం లో దాదాపు 1700 కిలోమీటర్ ల స్థాయి నుంచి రెట్టింపు కంటే మించిపోయి 2021వ సంవత్సరానికల్లా 4100 కి.మీ. కు పైబడటానికి తోడ్పడింది. ఆ కోవ కు చెందిన ప్రయత్నాల కు కొనసాగింపు గానే పంజాబ్ లో రెండు ప్రధానమైన రోడ్ కారిడార్ లకు శంకుస్థాపన జరగనుంది. ఇది ప్రధానమైన ధార్మిక కేంద్రాల కు చేరిక ను వృద్ధి చెందింపచేయాలన్న ప్రధాన మంత్రి దృష్టి కోణాన్ని ఆచరణలోకి తీసుకు వచ్చే దిశ లో ఒక అడుగుగా కూడాను పరిణమించనుంది.

సుమారు 39,500 కోట్ల రూపాయల మొత్తం వ్యయం తో 669 కి.మీ. పొడవున ఉండేటటువంటి దిల్లీ-అమృత్ సర్-కాట్ రా ఎక్స్ ప్రెస్ వే ను అభివృద్ధి పరచడం జరుగుతుంది. అది దిల్లీ నుంచి అమృత్ సర్ కు మరియు దిల్లీ నుంచి కాట్ రా కు ప్రయాణానికి పట్టేటటువంటి కాలాన్ని సగానికి తగ్గించగలుగుతుంది. ఈ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ వే సుల్ తాన్ పుర్ లోధీ, గోయింద్ వాల్ సాహిబ్, ఖదూర్ సాహిబ్, తరణ్ తరణ్ లలోని కీలకమైనటువంటి సిక్కు ధార్మిక కేంద్రాలను మరియు కాట్ రా లోని పవిత్ర హిందూ క్షేత్రమైన వైష్ణో దేవి ని కలుపుతుంది. ఈ ఎక్స్ ప్రెస్ వే మూడు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలైన పంజాబ్, జమ్ము - కశ్మీర్ లతో పాటు హరియాణా, చండీగఢ్ ల లోని అంబాలా చండీగఢ్, మొహాలీ, సంగ్ రూర్, పటియాలా, లుధియానా, జాలంధర్, కపుర్ తలా, కథువా ఇంకా సాంబాల లోని కీలకమైన ఆర్థిక కేంద్రాల ను సైతం జోడిస్తుంది.

దాదాపు 1700 కోట్ల రూపాయల ఖర్చు తో అమృత్ సర్- ఊనా సెక్షను ను నాలుగు దోవలు కలిగివుండేది గా చేయడం జరుగుతుంది. 77 కి.మీ. దూరం తో ఉండే సెక్షన్ అనేది అమృత్ సర్ నుంచి భోటా కారిడార్ ఉత్తర పంజాబ్ మరియు హిమాచల్ ప్రదేశ్ ల యొక్క రేఖాంశం లో విస్తరించి ఉండి, నాలుగు ప్రధాన జాతీయ రహదారుల ను కలుపుతుంది. ఆ నాలుగు ప్రధాన జాతీయ రహదారులు ఏవేవి అంటే అవి అమృత్ సర్ -భటిండ - జామ్ నగర్ ఇకానామిక్ కారిడార్ , దిల్లీ-అమృత్ సర్-కాట్ రా ఎక్స్ ప్రెస్ వే, నార్థ్ -సౌత్ కారిడార్ ఇంకా కాంగ్ రా-హమీర్ పుర్-బిలాస్ పుర్-శిమ్ లా కారిడార్ లు. ఇది ఘోమన్ లోను, శ్రీ హర్ గోబింద్ పుర్ లోను, ఫూల్ పుక్ తా పట్టణం (ప్రసిద్ధ గురుద్వారా ఫూల్ పుక్ తా సాహిబ్ నెలకొన్నది ఇక్కడే) లోను ఉన్నటువంటి ధార్మిక క్షేత్రాల కు సంధానాన్ని మెరుగుపరచడం లో సహాయకారి కానుంది.

ముకేరియాం కు, తల్ వాడా కు మధ్య సుమారు 27 కి.మీ. పొడవైన ఒక సరికొత్త బ్రాడ్ గేజ్ రైల్ వే లైను కు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. దీనిని 410 కోట్ల రూపాయలకు పైగా వ్యయం తో నిర్మించనున్నారు. ఈ రైల్ వే లైనను నాంగల్ ఆనకట్ట-దౌలత్ పుర్ చౌక్ రైల్ వే సెక్షను కు పొడిగింపు గా ఉంటుంది. ఇది ఆ ప్రాంతం లో అన్ని రకాల వాతావరణం లోనూ అనువు గా ఉండే రవాణా మాధ్యమాన్ని అందిస్తుంది. ఈ ప్రాజెక్టు కు వ్యూహాత్మకమైనటువంటి ప్రాధాన్యం కూడా ఉంటుంది. అది ఏమిటి అంటే ఇది జమ్ము కశ్మీర్ కు ఒక ప్రత్యామ్నాయ మార్గం గా కూడా ఉపయోగపడుతుంది. ఇది ప్రస్తుతం ఉన్నటువంటి జాలంధర్- జమ్ము రైల్ వే లైను లో ముకేరియాం వద్ద కలుస్తుంది. ఈ ప్రాజెక్టు ప్రత్యేకించి పంజాబ్ లోని హోశియార్ పుర్ ప్రజల కు మరియు హిమాచల్ ప్రదేశ్ లోని ఊనా ల ప్రజల కు ప్రయోజనకరం గా ఉండగలదు. ఇది ఆ ప్రాంతం లో పర్యటన రంగానికి దన్ను గా నిలుస్తుంది. అలాగే పర్వత ప్రాంత పట్టణాల తో పాటు గా ధార్మిక ప్రాధాన్యం కలిగిన క్షేత్రాల కు కూడాను సులభతర సంధానాన్ని సమకూర్చగలదు.

దేశం లో అన్ని ప్రాంతాల లో ప్రపంచ శ్రేణి వైద్య చికిత్స సదుపాయాల ను కల్పించాలి అనేటటువంటి ప్రధాన మంత్రి కృషి కి అనుగుణం గా, పంజాబ్ లోని మూడు పట్టణాల లో నూతన వైద్య రంగ సంబంధి మౌలిక సదుపాయాల కు పునాదిరాయిని వేయడం జరుగుతుంది. ఫిరోజ్ పుర్ లో 100 పడకల తో పిజిఐ శాటిలైట్ సెంటరు ను 490 కోట్ల రూపాయల కు పైగా వ్యయం తో నిర్మించడం జరుగుతుంది. దీనిలో ఇంటర్నల్ మెడిసిన్, సాధారణ శస్త్ర చికిత్స, ఎముకలకు, వేళ్ల కు సంబంధించిన చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ, నాడీశస్త్రచికిత్స, ప్రసూతిశాస్త్రం మరియు స్త్రీ రోగ శాస్త్రం, శిశువైద్య చికిత్స, నేత్రవైద్యశాస్త్రం, కన్ను-ముక్కు -చెవి మరియు మనోరోగచికిత్స శాస్త్రం-మాదకద్రవ్యాల వ్యసనాన్ని పారదోలడం సహా 10 ప్రత్యేక విభాగాల తో సేవల ను అందించడం జరుగుతుంది. ఇక శాటిలైట్ సెంటరు ఫిరోజ్ పుర్ లోను, చుట్టుపక్కల ప్రాంతాల లోను ప్రపంచ స్థాయి వైద్య చికిత్స సదుపాయాల ను సమకూర్చనుంది.

కపుర్ తలా లోను, హోశియార్ పుర్ లోను రెండు మెడికల్ కాలేజీల ను సుమారు 325 కోట్ల రూపాయల ఖర్చు తో అభివృద్ధిపరచడం జరుగుతుంది. వాటి సామర్థ్యం సుమారు 100 సీట్లు ఉంటుంది. ఈ కళాశాలల కు కేంద్ర ప్రాయోజిత పథకం అయినటువంటి 'జిల్లాలరిఫరల్ ఆసుపత్రుల కు అనుబంధపరచిన కొత్త మెడికల్ కాలేజీ ల స్థాపన' తాలూకు మూడో దశ లో భాగం గా ఆమోదం తెలపడం జరిగింది. ఈ పథకం లో పంజాబ్ కు మూడు మెడికల్ కాలేజీల స్థాపన కు ఆమోదం ఇవ్వడమైంది. ఒకటో దశ లో అనుమతి ఇచ్చిన కళాశాల ఎస్ఎఎస్ నగర్ లో ఇప్పటికే నడుస్తోంది.

# ఈ నెల 4 నుండి 12 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం....!

## -జిల్లా కలెక్టర్ హనుమంతరావు.



సంగారెడ్డి, జనవరి 3 (నేటినిజం ప్రతినిధి) జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీలలో ఈ నెల 4 నుండి 12 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు తమ తమ గ్రామపంచాయతీలలో జనవరి 4 నుండి 12 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జనవరి 4 నుండి 12 వరకు అన్ని గ్రామ పంచాయితీలలో రోజువారి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి ఫోటోలను వాట్సాప్ గ్రూప్ లో అప్లోడ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

మండల పంచాయితీ అధికారులు తమ పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీలలో ఇట్టి కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డివిజనల్ పంచాయతీ అధికారులు ఆయా డివిజన్లలో పూర్తిస్థాయిలో పర్యవేక్షించి ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాను పరిశుభ్ర స్వచ్ఛ జిల్లాగా రూపొందించాలని ఆయన కోరారు.

# పర్మిషన్ లేకుండానే.. లీవ్ లో వెళ్తున్న డాక్టర్లు..

హైదరాబాద్, జనవరి 3:తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖలోని వైద్య విద్య విభాగంలో అనుమతి లేకుండా సుదీర్ఘకాలంగా సెలవుల్లో ఉన్న 38 మంది వైద్యులపై చర్యలకు రంగం సిద్ధమైంది. వీరి సర్వీస్‌ను టెర్మినేట్ చేయాల్సిందిగా డీఎంఈ డా.రమేష్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అనుమతి లేకుండా సెలవులపై వెళ్లినందున సర్వీస్ టెర్మినేట్‌కు ప్రత్యేక కమిటీ కూడా సిఫారసు చేసిందన్నారు.ఈ 38 మంది వైద్యులకు షోకాజ్ నోటీస్ ఇచ్చినా స్పందన లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సబ్ ఆర్డినెట్ రూల్స్ చట్టం ప్రకారం సర్వీస్ టెర్మినేట్ చేయాలని ఆయా ఆసుపత్రుల అధిపతులను డీఎంఈ ఆదేశించారు. సర్వీస్ టెర్మినేట్ అయిన వారి వివరా లను మీడియాలో, గెజిట్‌లో ప్రచురించాలని ఆదేశించారు.

# వేములవాడ అర్బన్ ఎంపీపీ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జనవరి 3(నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్బంగా ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు అధికారులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సావిత్రిబాయి పులే ఆడపిల్లల చదువుకోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్యమూర్తి అని ఆమె అన్నారు .ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుస్త్రీ ల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యం అని బడుగు బలహీనవర్గాల మహిళ లకు తను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని ,నేటి మహిళలు సావిత్రిబాయి పూలే ఆమెను ఆదర్శంగా తీసుకొని సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలని ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి వైస్ ఎంపీపీ రవి చందర్ రావు ,ఎంపీడీవో కృష్ణ ఆనంద్,ఎంపీ ఓ శ్రీధర్ ,మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మృతురాలు వేముల రామలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, జనవరి 3(నేటినిజం ప్రతినిధి):వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి లో ఇటీవల మృతి చెందిన వేముల రామలక్ష్మి కుటుంబాన్ని సోమవారం టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.వీరితోపాటు పరామర్శించిన వారిలో మ్యాకల శ్రీనివాస్ ,గుడిసె సదానందం ,కొప్పుర వెంకట్ రెడ్డి ,సతీష్ రెడ్డి ,వికుర్తి సాయిగౌడ్ ,భుపేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు

# ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేస్తున్న కేసీఆర్‌పై ప్రజా తిరుబాటు తప్పదు

## -బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సునంద



రాజన్న సిరిసిల్ల, జనవరి 3(నేటినిజం ప్రతినిధి ):తెలంగాణ రాష్టంలో ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న తెరాస ప్రభుత్వంపై ప్రజలు తిరగబడి తరిమి కొట్టే పవనాలు చాలా బలంగా వీస్తున్నాయి వేములవాడ బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ముప్పిడి సునంద అన్నారు.సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులనునొక్కేస్తూ,ప్రజాస్వామ్య బద్దంగా నిరసనలు అనుగదొక్కుతూ ప్రజలను,ప్రశ్నించే నాయకులను అప్రజాస్వామ్య, పద్దతిలో చట్టాలను వారి చేతుల్లోకి తీసుకొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఏ ప్రభుత్వాలు నిలువ లేదు నిన్నటి రోజున మా రాష్ట్ర అధ్యక్షులు పార్లమెంట్ సభ్యులు.బండి సంజయ్ పై జరిగిన అమానుష చర్యను పూర్తిగా ఖండిస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఇక నైనా మారకుంటే తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురై పతనం కాక తప్పదని రాబోవు కాలంలో బండి సంజయ్ సారథ్యంలో ప్రభుత్వం పై తిరుగుబాటు ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.

# ప్రజల సమస్యలను రెవిన్యూ శాఖ అధికారులు , సిబ్బంది ముందుండాలి

## -జిల్లా కలెక్టర్ హనుమంతరావు

సంగారెడ్డి, జనవరి 3 (నేటినిజం ప్రతినిధి) సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన సంవత్సర



(2022) డైరీ ని, క్యాలెండర్ ను జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధినపు కలెక్టర్ వీరారెడ్డి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని రెవెన్యూ ఉద్యోగులందరూ రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేసి జిల్లాలోని రైతుల సమస్యలు పరిష్కరించడంలో ముందున్నారని, అందుకు రెవిన్యూ ఉద్యోగులందరికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. ప్రజల కోసం ముఖ్యంగా రైతుల కోసం అహర్నిశలు పనిచేయాలన్నారు. గత సంవత్సరం పని స్ఫూర్తితో, కొత్త సంవత్సరంలో కొత్త ఉత్సాహంతో ముందుకు వెళ్లాలన్నారు. అన్ని విధాల జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడంలో పూర్తి సహకారం అందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ రెవిన్యూ అసోసియేషన్ ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ తరపున 600 బ్లాంకెట్స్ ను కలెక్టర్ కు అందజేశారు. ఇట్టి బ్లాంకెట్ లను ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారులు నగేష్, రమేష్ బాబు, అంబదాస్ రాజేశ్వరరావు, రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బొమ్మ రాములు, కార్యదర్శి కె. మహిపాల్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు సతీష్ కుమార్, కిరణ్ కుమార్, షఫీ యుద్దీన్, కోశాధికారి దశరథ్, రాష్ట్ర కార్యదర్శి మనోహర్ చక్రవర్తి, ఉపాధ్యక్షులు గంగాధరరావు, కార్తీక్ కుమార్ , రాధా బాయి, కార్యవర్గ సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 31 వరకు మహారాష్ట్రలో పాఠశాలల మూసివేత

న్యూఢిల్లీ, జనవరి 3:దేశవ్యాప్తంగా రోజురోజుకు కరోనా కేసులు పెరుగుతున్నాయి. మహారాష్ట్రలో కూడా కరోనా మహమ్మారి కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మొన్నటి వరకు? కొంత వరకు తగ్గిన కరోనా కేసులు? ఇప్పుడు విపరీతంగా పెరుగుతున్నాయి. మహారాష్ట్రలో గడచిన 24 గంటల్లో 11887 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. అలాగే నిన్న ఒక్క రోజే 9 మంది ఈ వైరస్ బారినపడి మృతి చెందారు. ప్రస్తుతం మహారాష్ట్రలో 42 వేలకు పైగా కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయి. ముంబై మహానగరంలో ఈ కేసుల తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. కరోనా కేసుల నేపథ్యంలో పాఠశాలలను జనవరి 31వ తేదీ వరకు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఒకటి నుంచి 9వ తరగతి లకు మాత్రమే ఈ నియమ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అలాగే పదో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు పాఠశాలలు కొనసాగుతాయని పేర్కొంది. అయితే కరోనా నియమ నిబంధనలు పాటిస్తూ ఈ క్లాసులను నిర్వహించాలని సర్కార్ స్పష్టం చేసింది

# ఈ నెల 6,7 తేదీలలో వివిధ క్రీడాంశాలలో ప్రవేశాలకై ఎంపిక

మెదక్, జనవరి 3 (నేటినిజం ప్రతినిధి) స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో 2021-22 సంవత్సరానికి 14 నుండి 18 సంవత్సరాల లోపు వయస్సు గల బాల బాలికలకు రాష్ట్రంలోని వివిధ క్రీడా అకాడమిలలో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల్, సైక్లింగ్, రెజ్లింగ్, హాకీ, వాలీబాల్ క్రీడాంశాలలో ప్రవేశాలకై ఈ నెల 6,7 తేదీలలో ఎంపిక జరుగుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరుగు క్రీడాకారుల ఎంపిక ఉదయం 8 గంటల నుండి ప్రారంభమవుతుందని అన్నారు. హన్మకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం లో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల, ఖమ్మం లోని సర్దార్ పటేల్ అథ్లెటిక్ అకాడమిలో స్టేడియంలో అథ్లెటిక్స్, వనపర్తి హాకీ అకాడమిలో హాకీ, హైదరాబాద్ లోని ఉస్మానియా క్యాంపస్ లో గల సైక్లింగ్ అండ్ రెజ్లింగ్ అకాడమిలో సైక్లింగ్, రెజ్లింగ్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం లో వాలీబాల్ అంశాలలో ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. కాగా వాలీబాల్ పోటీలకు 14 నుండి 16 సంవత్సరాల వయస్సుల వారికి బాలురు 182 సెంటీమీటర్ల ఎత్తు, బాలికలు, 166 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అయితే 16 నుండి 18 సంవత్సరాల వయస్సువారికి, వరుసగా 186, 170 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉండాలని వివరాలకు 9347344440 ఫోన్ కు సంప్రదించాలని అన్నారు. వివిధ క్రీడాంశాలలో ప్రవేశాలకై ఆసక్తి గల యువత జనన ధ్రువపత్రం, విద్యార్హత, ఫిట్నెస్ సర్టిఫికెట్, ఆధార్, రెసిడెన్షియల్ ప్రూఫ్, 10 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు,కోవిడ్ పరీక్ష రిపోర్ట్ ఒరిజినల్స్ తీసుకొని వెళ్లాలని, వివరాలకు తెలంగాణా స్పోర్ట్స్ అథారిటీ ఫోన్ 040-2324297 లేదా ఈ మెయిల్ బజీబిబష్ట్రఎటఏతీవటతిటటఎజీతిశ్రీ.ఇనీఎ ను సంప్రదించాలని నాగరాజ్ సూచించారు.

# జనవరి 11న సదరం శిబిరం..!

సంగారెడ్డి, జనవరి 3 (నేటినిజం ప్రతినిధి)సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి నెల మూడవ మంగళవారం రోజున నిర్వహించు సదరం శిబిరాన్ని ఈనెల 11 న రెండవ మంగళవారం (11.01.2022) నాడు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గాయత్రి దేవి సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

సంబంధిత స్లాట్స్ 5.01.2022 న కేటాయించడం జరుగుతుందన్నారు. మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని సదరం శిబిరానికి హాజరు కావాలని ఆమె సూచించారు.

సదరం శిబిరానికి హాజరు కాదలచిన వారు మీసేవ ద్వారా స్లాట్స్ బుక్ చేసుకుని హాజరుకావాల్సిందిగా ఆమె సూచించారు.


**IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURTS AT SECUNDERABAD**
**O.P.NO. 448 OF 2019**

Between:
**Jaya sree & Rangu. Jayasri Vs. Vadnala Srinivas & Others**

**NOTICE**

To
R2. D. Murali goud,
S/o. Narsa Goud, Aged: Major
Occ: Business,
R/o. H.No. 1-3-174/7,
A.N. Reddy Colony
Nirmal, Adilabad,
Telangana- 504 106.

WHEREAS the Petitioner have filed the above case for compensation under M.V.Act and Rules and the same is posted for your appearance and counter on **11.1.2022.**

Hence, you are requested to appear before the said Hon'ble Court at 10.30 am either in your person or through your Advocate on the said date, otherwise, the matter will be decided in your absence,

//BY ORDER //
Counsel for the Petitioners
**M/S. P.SRINIVAS**
**M. DHANALAKSHMI**
**N. RAJU NAIK**
**ADVOCATES**
H.No.6-18/1, "SHREE" Nivas, Sreeram Nagar colony, Anupuram, Kapra, ECIL, Hyderabad- 500 06 2
Cell: 9246365011


# మద్యంను ఇంటి వద్దనే డెలివరీ చేసేందుకు అనుమతించాల్సిందిగా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్న ఐఎస్‌డబ్ల్యూఏఐ



హైదరాబాద్, జనవరి 3:ప్రీమియం ఆల్కోబేవ్ రంగానికి చెందిన అత్యున్నత సంస్థ ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎస్‌డబ్ల్యూఏఐ), పెరుగుతున్న కోవిడ్ ఆందోళనలు (ఒమిక్రాన్) నేపథ్యంలో మద్యంను హోమ్ డెలివరీ చేసే అవకాశాన్ని పరిశీలించాల్సిందిగా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుత పండుగ మాసాలలో మద్యం వినియోగం అధికమయ్యే అవకాశాలు ఉన్నాయి. హోమ్ డెలివరీని ప్రారంభించడం/ అధికారీకరించడం ద్వారా ఈ రంగంలో నష్టాలను తగ్గించవచ్చు. ఇది ప్రజలకు సౌకర్యం అందించడంతో పాటుగా ఉద్యోగాలనూ కాపాడుతుంది. అదే సమయంలో ఆల్కోబేవ్ పరిశ్రమ నుంచి రాష్ట్ర ఆదాయమూ మెరుగుపడుతుంది.

ఐఎస్‌డబ్ల్యూఏఐ సీఈవో నీతా కపూర్ మాట్లాడుతూ మద్యంను హోమ్ డెలివరీ చేయడం గురించి వినియోగదారుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు లోకల్ సర్కిల్స్ చేసిన అధ్యయనంలో 52% మంది రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని వెల్లడించారన్నారు. భౌతిక దూరం, సౌకర్యం అనేవి హోమ్ డెలివరీలో అత్యంత కీలకాంశాలుగా వినియోగదారులు అభిప్రాయపడుతున్నారని వెల్లడించారు. పలు రాష్ట్రాల ప్రజల నుంచి వస్తోన్న డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని అన్ని నియంత్రణ, మార్గదర్శకాలకు లోబడి హోమ్ డెలివరీ మోడల్‌ను రెగ్యులరైజ్ చేయాల్సిందిగా కోరారు. ఈ విధానం వల్ల బాధ్యతాయుతంగా మద్యపాన అలవాటు



పెరగడంతో పాటుగా రాష్ట్రాలకు అదనపు ఆదాయం కూడా లభిస్తుందన్నారు.

ఒమిక్రాన్ ఆందోళనలు వృద్ధి చెందుతున్న వేళ, పరిశ్రమ నష్టపోకుండా చేస్తూనే వినియోగదారుల డిమాండ్ తీర్చేందుకు హోమ్ డెలివరీని శాశ్వత ఫీచర్‌గా చేయాల్సిందిగా కోరారు.


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.